RNI NO. TELTEL/2022/83470

manasakshi.in

# మనసాక్షి

మీకోసం

తెలుగు దినపత్రిక


ఎడిటర్ : మల్లె నాగిరెడ్డి

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 2. సంచిక : 91 | సోమవారం 25 డిసెంబర్ 2023 | పేజీలు 8 | వెల: రూ.1.00 | epaper.manasakshi.in

## దేశంలో జేఎన్1 వేరియంట్ కలకలం

**కరోనా పరీక్షల సంఖ్యను పెంచిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు**

**తెలంగాణలో తాజాగా 12 పాజిటివ్ కేసుల గుర్తింపు**



దేశవ్యాప్తంగా మరోసారి కరోనా కేసుల వ్యాప్తి కొనసాగుతోంది. ఇటీవల జేఎన్1 వేరియంట్ వెలుగు చూసిన నేపథ్యంలో... రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కరోనా నిర్ధారణ పరీక్షల సంఖ్యను పెంచాయి. తాజాగా, తెలంగాణలో 1,322 శాంపిళ్లను పరీక్షించగా... 12 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మరో 30 మంది ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది. తాజా పాజిటివ్ కేసులతో కలిపి రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 8,44,540కి పెరిగింది. ఇవాళ ఒకరు కరోనా నుంచి కోలుకున్నారు. తెలంగాణలో కరోనా రోగుల రికవరీ రేటు 99.51 శాతంగా ఉంది.



# అధికారులపై ఎలాంటి వివక్ష ఉండదు...

**బాధ్యతగా పనిచేయండి: సీఎం రేవంత్ రెడ్డి**

**జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం**

**ప్రజలతో మమేకం అవ్వాలని అధికారులకు సూచన**

**నేతలకు ఐదేళ్లే... అధికారులకు 35 ఏళ్ల సర్వీసు ఉంటుందని వెల్లడి**

**బాధ్యతతో మెలగాలని పిలుపు**

**హైదరాబాద్:**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న ఉన్నతాధికారులపై ఎలాంటి వివక్ష ఉండదని స్పష్టం చేశారు. "మీరు వివిధ రాష్ట్రాల్లో పుట్టి పెరిగి, ఆలిండియా సర్వీసు పోటీ పరీక్షలు రాసి ఐఏఎస్ లు, ఐపీఎస్ లుగా సెలెక్ట్ అయ్యారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఎంచుకుని ఇక్కడికి వచ్చారు. ఒక బాధ్యత తీసుకుని రాష్ట్ర నిర్మాణంలో పాలుపంచుకోవడానికి మీరు ఇక్కడికి వచ్చారు. ఇక్కడి పౌరులతో మమేకం అయ్యారు. మాది వేరే రాష్ట్రం అనో, మా భాష వేరు అనో మీరెవరూ భావించాల్సిన పనిలేదు. మేమెవరం కూడా మిమ్మల్ని ఆ కోణంలో చూడడంలేదు, ఎలాంటి వివక్ష చూపించడంలేదు. మీరు స్థానిక ప్రజల భాష తెలుసుకోండి, ప్రజల మనసులు గెలవండి. రాజకీయనేతలకు ఐదేళ్లే కాలపరిమితి, మీకు 35 ఏళ్ల సర్వీసు ఉంటుంది. అన్ని సంవత్సరాల సర్వీసును మీకందిస్తున్నారంటే, మీరు ఎంత జవాబుదారీతనంతో వ్యవహరించాలో అర్థం చేసుకోండి. కొంతమంది అధికారులు బదిలీ అయి వెళ్లిపోతున్నప్పుడు ప్రజలు సన్మానం చేయడం చూస్తుంటాం. .. ఓ మంచి అధికారిని ప్రభుత్వం బదిలీ చేస్తోందని కన్నీరు పెట్టుకుంటారు. మీరు కూడా ప్రజల్లో నమ్మకం పొందేలా పనిచేయండి. మీరు తెలంగాణలో ఎక్కడికి వెళ్లినా బాధ్యతతో మెలగండి" అని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు కార్యక్రమాలు

జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ముందస్తు సమావేశాలు

నియోజకవర్గ స్థాయిలోనూ సమావేశాలు..అన్నింటికీ ఒకటే దరఖాస్తు ఫారం

మహిళలకు ప్రత్యేక కౌంటర్లు.. రోజువారీ దరఖాస్తుల వివరాలు పంచాయతీరాజ్ శాఖకు

ప్రజాపాలన కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వ సూచనలు

## ఈ నెల 28 నుంచి ఆరు గ్యారెంటీల దరఖాస్తులు స్వీకరిస్తాం

**ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు ప్రకటించిన కాంగ్రెస్**

**ఎన్నికల్లో గెలిచి రేవంత్ రెడ్డి సీఎంగా ప్రభుత్వం ఏర్పాటు**

**ఇప్పటికే రెండు గ్యారెంటీల అమలు**

**హైదరాబాద్:** అధికార పక్షం కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు ప్రకటించిన సంగతి తెలిసిందే. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఇటీవలే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. ఈ నేపథ్యంలో,



ఆరు గ్యారెంటీల అమలుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధమైంది. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వివరాలు తెలిపారు. ఆరు గ్యారెంటీలకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించారు. ముందుగా ఈ దరఖాస్తులను ప్రజలకు అందిస్తామని, ఆపై వాటిని డిసెంబరు 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు స్వీకరించడం జరుగుతుందని వివరించారు. గ్రామసభల్లో ఈ దరఖాస్తులు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులు సమర్పించిన వారికి అధికారులు ఒక రసీదు ఇస్తారని పొంగులేటి చెప్పారు. అధికారులు ఆ దరఖాస్తులు పరిశీలించి, వారు ఏ పథకాలకు అర్హులో నిర్ణయిస్తారని పేర్కొన్నారు. ఓ ప్రాంతంలో కేవలం 10 ఇళ్లు ఉన్నా సరే, అధికారులు అక్కడికి వెళ్లి దరఖాస్తులు స్వీకరించాలని ఆదేశించామని పొంగులేటి స్పష్టం చేశారు. తామిచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే రెండు అమలు చేశామని, మిగిలిన నాలుగింటిని కూడా అమలు చేయడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుంటుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో మంత్రులు కూడా పాల్గొన్నారు. ఈ సమావేశం ముగిసిన తర్వాత పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడుతూ పై వివరాలు తెలిపారు.

## ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకుంటాం

**ఉద్యోగులు, నిరుద్యోగులకు ఎంతో చేసినా చెప్పుకోలేక వెనుకబడ్డాం: మీడియాతో కేటీఆర్**



**హైదరాబాద్:** ప్రతి గెలుపులో పాఠాలుంటే.. ఓటమిలో గుణపాఠాలు ఉంటాయని.. ఆ గుణపాఠాలు నేర్చుకుంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు చెప్పారు. దేశంలోనే ఉద్యోగులకు అత్యధిక జీతాలు ఇచ్చామని, నిరుద్యోగులకు అత్యధికంగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని.. కానీ సరైన విధంగా ప్రచారం చేసుకోలేకపోయామని పేర్కొన్నారు.'నిజం గడప దాటే లోపల.. అబద్ధం ఊరంతా తిరిగి వస్తుంద'న్న సామెత నిజమైందని.. కాంగ్రెస్ అబద్ధాలు, అలవి గాని హామీలను ప్రజలు నమ్మారని వ్యాఖ్యానించారు. యూట్యూబ్‌లో కొందరు బట్టగాల్చి మీదేసే ప్రయత్నం చేస్తే నివారించలేకపోయామని, దానితోనూ కొంత నష్టం జరిగిందన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో 'స్వేద పత్రం' పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన తర్వాత మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు.

**ఓటమి స్పీడ్ బ్రేకర్ మాత్రమే..**

కేవలం 1.85శాతం ఓట్లతో తాము ఓడిపోయామని.. ఏడెనిమిది సీట్లు నాలుగైదు వేల ఓట్ల తేడాతో కోల్పోయామని చెప్పారు. ఇది ఘోర పరాజయం కాదని, ఒక స్పీడ్ బ్రేకర్ మాత్రమేనని పేర్కొన్నారు. కాంగ్రెస్ అలవికాని హామీలు ఇచ్చిందన్నారు. "రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒకటే కోరుతున్నా. మీరు విజయవంతం కావాలని మేం కోరుకుంటున్నాం. ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చాలని కోరుతున్నాం. వందరోజుల్లో చాలా చేస్తామని చెప్పారు. వందరోజుల కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. తప్పకుండా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలి. మొన్ననే నాలుక మడతేశారు. నిరుద్యోగ భృతి ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టినా.. ఉప ముఖ్యమంత్రి తాము ఆమాటే అనలేదన్నారు. ఇలా ఎన్నో ఉన్నాయి. ఆరు గ్యారంటీలు కాదు. 142 హామీలున్నాయి. వాటిని లెక్కతీశాం. మా పార్టీ తరఫున శాఖల వారీగా షాడో టీమ్‌లు ఏర్పాటు చేస్తాం. వేరే దేశాల్లో వాటిని షాడో కేబినెట్ అంటారు. అలాంటిదే మా లెజి స్లేచర్‌లో ఏర్పాటు చేసుకుంటాం. ప్రతి ప్రభుత్వ శాఖలో, ప్రతిరంగంలో సర్కారు పనితీరు.. వారు ఏం చేస్తున్నారు? ఏ నిర్ణయాలు తీసుకుంటున్నారు? తదితర అంశాలన్నింటినీ నిశితంగా గమనించి ప్రజలకు వివరిస్తాం.." అని కేటీఆర్ చెప్పారు. దీప స్తంభంగా మారిన తెలంగాణను ఆరనివ్వబోమని, పడిపోనివ్వబోమని పేర్కొన్నారు.

**ఏ విచారణకైనా మేం సిద్ధం**

రాజకీయాల్లో పోటీకి వెళ్లిన ప్రతిసారీ గెలుస్తామనే ఆశిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే ప్రజలు రెండుసార్లు అవకాశం ఇచ్చారని, వారికి కృతజ్ఞతలు చెప్తున్నామని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడుతామని, ప్రతి అంశంపై రివ్యూ చేస్తామని చెప్పారు. "అధికారాన్ని ప్రజలకు సేవ చేసేందుకు, హామీలను నెరవేర్చేందుకు వినియోగిస్తారా? కక్ష సాధింపు కోసం వినియోగిస్తారా? అనేది వారి విజ్ఞత. ఏ విచారణ అయినా.. ఏ కమిషన్ అయినా.. ఏ రకమైన ఆదేశాలు ఇచ్చినా మాకు అభ్యంతరం లేదు.

## లోక్‌సభ టికెట్లకు భాజపాలో పోటాపోటీ

**భాజపాలో లోక్‌సభ అభ్యర్థిత్వాల సందడి మొదలైంది. శాసనసభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో లోక్‌సభ స్థానాలపై ముఖ్యనేతలు దృష్టిసారించారు. కీలక స్థానాల కోసం పలువురు నేతలు పోటీపడుతుండగా కొన్ని స్థానాల్లో కొత్త అభ్యర్థులకోసం అన్వేషణ జరుగుతోంది.**

**అభ్యర్థిత్వాల కోసం కీలక నేతల ప్రయత్నాలు**

**నాలుగు సిటింగ్ స్థానాల్లో మళ్లీ వాళ్లే**

**మల్కాజిగిరిపై కీలక నేతల గురి**

**హైదరాబాద్ :** భాజపాలో లోక్‌సభ అభ్యర్థిత్వాల సందడి మొదలైంది. శాసనసభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో లోక్‌సభ స్థానాలపై ముఖ్యనేతలు దృష్టిసారించారు. కీలక స్థానాల కోసం పలువురు నేతలు పోటీపడుతుండగా కొన్ని స్థానాల్లో కొత్త అభ్యర్థులకోసం అన్వేషణ జరుగుతోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లో భాజపా విజయం సాధించగా ఈసారి వీటితో పాటు మరికొన్ని స్థానాలపై ప్రత్యేకంగా దృష్టిసారించారు. అత్యధిక స్థానాల్లో ఒకరికంటే ఎక్కువమంది బలమైన అభ్యర్థులు తమకు ఉన్నారని... మెజారిటీ సీట్ల సాధనే లక్ష్యంగా ఈసారి తమ కార్యాచరణ ఉంటుందని ఆ పార్టీ ముఖ్యనేతలు పేర్కొంటున్నారు. శాసనసభ ఎన్నికల్లో 8 స్థానాల్లో గెలిచిన భాజపా... చాలా నియోజకవర్గాల్లో గణనీయ సంఖ్యలో ఓట్లను సాధించింది. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో అనుకూలమైన ఫలితాలు వస్తాయన్న అంచనాలతో పలువురు ఈసారి బరిలో దిగేందుకు ప్రయత్నాలను ముమ్మరంచేశారు.

**పలు స్థానాలకు డిమాండ్...**

సికింద్రాబాద్ స్థానం నుంచి భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మరోమారు బరిలో దిగనుండగా... భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కరీంనగర్ నుంచి, సిటింగ్ ఎంపీలు సోయం బాపురావు ఆదిలాబాద్ నుంచి, ధర్మపురి అర్వింద్ నిజామాబాద్ నుంచి పోటీ చేయడం దాదాపు ఖాయమని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంలో పోటీ చేసేందుకు కీలకనేతలు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడి అభ్యర్థిత్వం కోసం భాజపా మధ్యప్రదేశ్ ఇన్‌ఛార్జి మురళీధర్‌రావుతో పాటు ఈటల రాజేందర్ కూడా ఈ స్థానంపై ఆసక్తితో ఉన్నట్లు సమాచారం. పేరాల చంద్రశేఖర్, టి.వీరేందర్‌గౌడ్, సామరంగారెడ్డి, రామచందర్‌రావు, ఆకుల రాజేందర్, ఎస్.మల్లారెడ్డి సహా కొత్త నేతలు కూడా తమ ప్రయత్నాల్లో ఉన్నారు. ఎక్కువమంది నేతలు ఆసక్తి చూపుతున్న మరో లోక్‌సభ స్థానం జహీరాబాద్. ఇక్కడనుంచి పోటీకి మాజీ ఎంపీ బాగారెడ్డి కుమారుడు జైపాల్‌రెడ్డి, దివంగత సీనియర్ నేత ఆలే నరేంద్ర తనయుడు ఆలే భాస్కర్‌తో పాటు, చీకోటి ప్రవీణ్ దృష్టిసారించారు. సామాజిక వర్గాల సమీకరణ నేపథ్యంలో ఇక్కడ ఈటల రాజేందర్ అభ్యర్థిత్వం కూడా పరిగణనలో ఉంది. మహబూబ్‌నగర్ నుంచి గత లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసిన భాజపా జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె.అరుణ మరోసారి అక్కడి నుంచి పోటీకి సిద్ధమయ్యారు. ఈ స్థానంపై మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి కూడా ఆసక్తి చూపుతున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. చేవెళ్ల నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పోటీ చేయడం దాదాపు ఖాయమని తెలుస్తోంది.

# 5 రోజులు బ్యాంకులు బంద్...



బ్యాంకుల్లో మీకు ఏదైనా పని ఉందా? కొత్త ఏడాదికి ముందు బ్యాంకుల్లో డిసెంబర్ 31 డెడ్‌లైన్స్ చాలానే ఉన్న సంగతి తెలిసిందే. ఆ పనులు చేసుకోవడానికి ఇంకా కొద్దిరోజులు మాత్రమే ఉంది. అయితే ఇప్పుడు క్రిస్మస్ పండగ సహా వీకెండ్ నేపథ్యంలో వరుసగా సెలవులు వస్తున్నాయి. అంతటా వరుసగా 3 రోజులు బ్యాంకులు బంద్ ఉండగా.. ఇంకా కొన్ని ప్రాంతాల్లో 5 రోజుల వరకు సెలవులు ఉండటం గమనార్హం. క్రిస్మస్ పండగ ఈ సారి సోమవారం వచ్చింది. దీంతో ఆ రోజు డిసెంబర్ 25న దేశవ్యాప్తంగా బ్యాంకులు మూసివేసి ఉంటాయి. ఇక అంతకుముందు డిసెంబర్ 23న నాలుగో శనివారం, డిసెంబర్ 24న ఆదివారంతో కలిపి దేశవ్యాప్తంగా అన్ని చోట్లా వరుసగా 3 రోజుల పాటు బ్యాంకులు పనిచేయవన్నమాట. ఇది లాంగ్ వీకెండ్ అని చెప్పొచ్చు. అయితే కొన్ని రాష్ట్రాల్లో, కొన్ని ప్రాంతాల్లో చూసుకుంటే క్రిస్మస్ సహా స్థానిక పండగల నేపథ్యంలో 5 రోజుల వరకు బంద్ ఉన్నాయి. మరి ఈ నెలలో బ్యాంకులు ఆఖరి 10 రోజుల్లో ఎప్పుడెప్పుడు మూసివేసి ఉంటాయనే వివరాలు చూద్దాం.

బ్యాంకుల్లో చాలా మందికి ఎప్పుడూ ఏదో ఒక పని ఉంటుంది. డిసెంబర్ నెలతో ఈ సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో చాలా ఆర్థిక కార్యకలాపాల కోసం బ్యాంకులతో పని ఉంటుంది. అందుకే ఏ రోజు సెలవు ఉంటుందో.. ఏ రోజు బ్యాంకు పని చేస్తుందో తెలుసుకొని దానికి అనుగుణంగా షెడ్యూల్ చేసుకోవాలి. ఇంకా కొన్ని స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటి వాటి గడువు కూడా చాలా బ్యాంకుల్లో డిసెంబర్ 31తో ముగుస్తోంది. అందుకే బ్యాంకు సెలవులు ఎప్పుడెప్పుడు ఎక్కడ ఉన్నాయో ఇక్కడ చూడండి.

క్రిస్మస్ బ్యాంక్ సెలవులు.. ఎక్కడ.. ఎలా..

డిసెంబర్ 25 - సోమవారం- దేశవ్యాప్తంగా బ్యాంకులు బంద్. డిసెంబర్ 26- మంగళవారం- క్రిస్మస్ సెలబ్రేషన్స్- మిజోరం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయల్లో బ్యాంకులు మూసివేసి ఉంటాయి. డిసెంబర్ 27- బుధవారం- క్రిస్మస్ సందర్భంగా అరుణాచల్ ప్రదేశ్‌లో బ్యాంకులు బంద్. ఇక డిసెంబర్ 24న ఆదివారం, డిసెంబర్ 23 నాల్గవ శనివారం కాబట్టి.. ఇక్కడ 5 రోజుల వరకు సెలవులు ఉన్నాయని గమనించాలి. సమస్యలు ఎప్పుడు వస్తాయి, వాటి లక్షణాలు ఏంటి? అయితే బ్యాంకులకు సెలవులు ఉన్నప్పటికీ.. నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వంటి సేవలు పనిచేస్తాయి. ఏటీఎం లు, డిపాజిట్ మెషీన్లు కూడా అందుబాటులో ఉంటాయి. ఏదైనా కచ్చితంగా బ్యాంకులు వెళ్లి చేసుకోవాల్సిన పనులకు మాత్రం ఆటంకం కలుగుతుంది. అందుకే.. బ్యాంక్ సెలవుల్ని బట్టి పనుల్ని షెడ్యూల్ చేసుకోవడం ఉత్తమం. ఇక వచ్చే ఏడాది కూడా జనవరి నెలలో బ్యాంకులకు చాలానే సెలవులు ఉంటాయని చెప్పొచ్చు. జనవరి 1 సహా సంక్రాంతి సెలవులు చాలా చోట్లే ఉంటాయి.

# ఇంకా పెరుగుతూనే ఉందిగా!

క్యాపిటల్ గూడ్స్ కేటగిరీ స్టాక్ తమ ఇన్వెస్టర్లకు అదిరే గుడ్‌న్యూస్ చెప్పింది. ఒక్క షేరుకు 4 షేర్లు బోనస్‌గా అందించనున్నట్లు తెలిపింది. దీంతో ఈ కంపెనీ షేర్లు దూసుకెళ్తున్నాయి. గత 5 రోజుల్లోనే ఏకంగా 20 శాతం పెరిగింది. 5 ఏళ్ల కాలంలో చూసుకుంటే 350 శాతం రిటర్న్స్ అందించింది. ఆ స్టాక్ గురించి ఇప్పుడే తెలుసుకోండి మరి.

దేశంలో మరోసారి కరోనా మహమ్మారి విజృంభిస్తోందన్న వార్తల నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం ట్రేడింగ్ లో ఒక్కసారిగా కుప్పకూలాయి. ఇవాళ ఒడుదొడుకుల్లో ట్రేడింగ్ అవుతున్నాయి. అయితే ఇలాంటి పరిస్థితుల్లోనూ క్యాపిటల్ గూడ్స్ పరిశ్రమలో సలాసర్ టెక్నో ఇంజినీరింగ్ లిమిటెడ్ ( కంపెనీ స్టాక్ అదరగొడుతోంది. గడిచిన 5 రోజుల్లోనే ఏకంగా 20 శాతానికిపైగా పెరిగింది. అందుకు ప్రధాన కారణం ఈ సంస్థ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు 4:1 నిష్పత్తిలో బోనస్ షేర్లను ప్రతిపాదించడమే. దీంతో ఈ టవర్ మేకింగ్ కంపెనీ అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ కంపెనీలో ఒక్క షేరు ఉన్న వారికి 4 షేర్లు ఉచితంగా బోనస్‌గా లభిస్తాయి. బుధవారం, డిసెంబర్ 20వ తేదీన జరిగిన సమావేశంలో డైరెక్టర్ల బోర్డు 4:1 నిష్పత్తిలో బోనస్ షేర్ల ఇష్యూకు ప్రతిపాదన చేసింది. ఒక్క ఈక్విటీ షేరు కలిగి ఉన్న షేర్ హోల్డర్లకు నాలుగు షేర్లు ఉచితంగా అందించనుంది. అయితే అర్హత ఉన్న షేర్ హోల్డర్లకు షేర్లు కేటాయించేందుకు రికార్డు తేదీని ఇంకా ఖరారు చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని ఎక్స్ఛేంజీ ఫైలింగ్ లో సెపరేట్ గా తెలియజేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. మొత్తంగా 126,28,21,120 ఈక్విటీ షేర్లను బోనస్ షేర్లుగా జారీ చేయాలని డైరెక్టర్ల బోర్డు ప్రతిపాదించింది. 2023 సెప్టెంబర్ 30 నాటికి అందుబాటులో ఉన్న కంపెనీ సెక్యూరిటీ ప్రీమియం ఖాతా నుంచి బోనస్ ఈక్విటీ షేర్లు జారీ చేస్తారు. సెప్టెంబర్ 30 నాటికి రూ. 38,450.07 లక్షల నిధులు ఉచిత నిల్వలుగా లేదా క్యాపిటలైజేషన్ కోసం అందుబాటులో ఉన్న షేర్ ప్రీమియంగా ఉంది. బోర్డ్ మీటింగ్ తేదీ నుండి 2 నెలలలోపు బోనస్ షేర్లను క్రెడిట్ చేయనుంది.



హైరిటర్న్స్.. గత 3 ఏళ్ల కాలంలో చూసుకుంటే ఈ స్టాక్ 408 శాతం పెరిగి ఇన్వెస్టర్లకు మల్టీబ్యాగర్ రాబడిని అందించింది. గత ఐదు సంవత్సరాలలో 353 శాతం పెరిగింది. గత సంవత్సరంలో చూసుకుంటే 5.23 శాతం పెరిగింది. 2023 లో ఇప్పటివరకు 9.91 శాతం పెరిగింది. 52 వారాల గరిష్ట స్థాయి రూ. 64.75. 52 వారాల కనిష్ట స్థాయి రూ. 36.25 గా ఉంది. గురవారం ట్రేడింగ్ లో ఈ స్టాక్ 5.78 శాతం పెరిగి రూ. 63.10 వద్ద ట్రేడ్ అవుతోంది. 5 శాతం మేర పెరిగి అప్పర్ సర్క్యూట్ కొట్టింది. ఇన్వెస్టర్లకు భారీ లాభాలు అందించింది. మూడేళ్ల క్రితం ఇందులో రూ. 1లక్ష పెట్టి షేర్లు కొనుగోలు చేసిన వారికి ఇప్పుడు ఆ విలువ రూ. 5 లక్షల పైన ఉంటుంది. అంటే రూ.4 లక్షలు లాభాలు వచ్చాయి

# 43 శాతం ప్రీమియంతో లిస్టింగ్..



ఐనాక్స్ ఇండియా ఐపీఓ అదరగొట్టింది. గురువారం రోజున స్టాక్ మార్కెట్లలో 43 శాతం ప్రీమియంతో లిస్టింగ్ అయింది. ఐపీఓ గరిష్ఠ ధరతో పోలిస్తే ఒక్కో షేరుపై రూ.290 మేర లాభాలు అందించింది. ఆ వివరాలు తెలుసుకుందాం.

ఐనాక్స్ ఇండియా ఐపీఓలో షేర్లు దక్కించుకున్న ఇన్వెస్టర్లకు హై రిటర్న్స్ అందించింది. ఈ రోజు స్టాక్ మార్కెట్లలో లిస్టింగ్ అయిన ఐనాక్స్ ఇండియా ఐపీఓ భారీ లాభాలు అందించింది. ఐపీఓ ఇష్యూ ధర రూ. 660తో (అప్పర్ లిమిట్) తో పోలిస్తే ఏకంగా 43 శాతం ప్రీమియంతో లిస్టింగ్ అయింది. ఒక్కో షేరు ధర రూ. 949.65 వద్ద లిస్టింగ్ అయింది. అంటే ఒక్క షేరుపై ఏకంగా రూ.300 మేర లాభాలు వచ్చాయి. అయితే, మార్కెట్లలో కరోనా అనిశ్చితితో మళ్లీ కాస్త వెనక్కి తగ్గింది. ప్రస్తుతం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలో 3 శాతం తగ్గి 921 స్థాయి వద్ద కొనసాగుతోంది. అయినప్పటికీ ఇన్వెస్టర్లకు మంచి లాభాలే అందించినట్లవుతుంది. ఐనాక్స్ ఇండియా ఐపీఓ డిసెంబర్ 14వ తేదీ నుంచి డిసెంబర్ 18 మధ్య సబ్ స్క్రిప్షన్ కు వచ్చింది. ఈ సందర్భంగా ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన లభించింది. 61.28 రెట్లు మేర సబ్‌స్క్రిప్షన్ అయింది. క్వాలిఫైడ్ ఇనిస్టిట్యూషనల్ బయ్యర్స్ 147.80 రెట్లతో ముందు వరసలో ఉన్నారు. హై నెట్ వర్త్ ఇండివిడ్యువల్, రిటైల్ ఇన్వెస్టర్స్ వరుసగా 53.20 రెట్లు, 15.3 రెట్లు సబ్ స్క్రైబ్ చేసుకున్నారు. ఐనాక్స్ ఇండియా క్రయోజనిక్ ఈక్విప్‌మెంట్ తయారీలో కీలక పాత్ర పోషిస్తోంది. ఇస్రో కోసం ట్రెయిలర్ మౌంటెడ్ హైడ్రోజన్ ట్రాన్స్‌పోర్ట్ ట్యాంక్ తయారు చేసిన తొలి సంస్థగా ఐనాక్స్ ఇండియా నిలిచింది. గత ఆర్థిక ఏడాది చివరి త్రైమాసికంలో ఐనాక్స్ సీవీఓ కంపెనీ బలమైన ఫలితాలను ప్రకటించింది. 17 శాతం నెట్ ప్రాఫిట్ వృద్ధితో రూ.152.7 కోట్లు లాభాలు చూపించింది. అదే సమయంలో కంపెనీ రెవెన్యూ 23.4 శాతం పెరిగి రూ. 966 కోట్లుగా నమోదైంది. ఐపీఓ పరంగా చూసుకుంటే మార్కెట్లలో 75 -80 శాతం ప్రీమియంతో లిస్టింగ్ అవుతుందని అంచనా వేసినా ప్రస్తుతం మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితులు ప్రతికూల ప్రభావం చూపాయి. దీంతో 43 శాతం ప్రీమియంతో లిస్టింగ్ అయింది. ప్రస్తుతం ప్రాఫిట్ బుకింగ్ సెటిమెంట్ కనిపిస్తోంది. దీంతో ఈ షేర్లు పడిపోతున్నాయని చెప్పవచ్చు. ఎన్ఎస్ఈలో ఇవాళ్టి ట్రేడింగ్ లో చూస్తే లిస్టింగ్ ప్రైస్ రూ.660గా ఉంది. అలాగే ఇంట్రాడే హై వాల్యూ రూ.979 స్థాయిని తాకింది. ప్రాఫిట్ బుకింగ్స్ తో ఒక స్థాయిలో రూ.855.10 కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఆ తర్వాత కోలుకుని మళ్లీ రూ.921 స్థాయికి చేరింది. ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతోంది.

# డబ్బు ఆదా చేయొచ్చు!

డిసెంబర్ నెల చివరికి వచ్చేశాం. కొద్ది రోజుల్లోనే 2023 కు బై బై చెప్పేసి 2024 లోకి అడుగుపెట్టనున్నాం. కొత్త ఏడాదిలో తాము చేయాలనుకుంటున్న పనులు , ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకుంటారు చాలా మంది. అలాగే గత సంవత్సరంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుని ముందుకు సాగాలను భావిస్తారు. ఇది ఆర్థిక అంశాల్లో చాలా ముఖ్యమైన అంశం. అందుకే కొత్త ఏడాదిలో ఆర్థిక ప్రణాళిక సరిగ్గా ఉండేలా చూసుకోవాలి. పెట్టుబడులను సమీక్షించుకుంటూ కొత్త పెట్టుబడులు, ఇతర అంశాలపై దృష్టి సారించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కొత్త ఏడాది మొత్తం ఆర్థిక స్వావలంబన సాధించడానికి ఏం చేయాలో ఇప్పుడు మనం తెలుసుకుందాం. అందుకు కార్యాచరణ మూడు భాగాలుగా ఉంటుంది. అందులో మొదటిది తప్పనిసరిగా తీసుకోవలసిన జాగ్రత్తలు. రెండోది పెట్టుబడి మార్గాల్లో రాబడి సమీక్షించుకోవడం. మూడోది పెట్టుబడి లేదా ఖర్చుల సమతౌల్యం చూసుకోవాలి. పర్సనల్ ఫైనాన్స్ జాగ్రత్తల్లో మొదటి ముఖ్యమైన అంశం ఇన్సూరెన్స్. తగినంత జీవిత బీమా, ఆరోగ్య బీమా అనేది కచ్చితంగా ఉండాలి. ఈ విషయంలో ఎలాంటి ఏమరపాటు ఉండకూడదు. చాలా మంది ఇన్సూరెన్స్ భవిష్యత్తులో ఎప్పుడైనా అవసరం అనిపిస్తే తీసుకోవచ్చు లే అని వాయిదా వేస్తూంటారు. ఇది సరైన ఆలోచన కాదు. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం కూడా ఏటా పెరుగుతుందని గుర్తుంచుకోవాలి. అలాగే కొన్ని రకాల వ్యాధులకు బీమా కవరేజ్ వెంటనే అమల్లోకి రాదు. అందువల్ల అవసరాలకు సరిపోయే బీమా వెంటనే తీసుకోవాలి. పర్సనల్ ఫైనాన్స్ లో మరొక ముఖ్యమైన విషయం.. జీవిత భాగస్వామికి, ముఖ్యమైన వారికి మన పెట్టుబడి వివరాలపై అవగాహన ఉండాలి. ఏదైనా అనుకోని విపత్తు జరిగితే ముఖ్యమైన వివరాలు సులభంగా అందేలా చూసుకోవాలి.

పెట్టుబడి మార్గాల రాబడి సమీక్ష... పెట్టుబడి మీద రాబడిని అర్థం చేసుకోవడానికి వివిధ కొలమానాలు ఉంటాయి. వాటిలో ముఖ్య మైనవి మొత్తం రాబడి , వార్షిక వృద్ధి, ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్, ఎక్స్టెండెడ్ రేట్ ఆఫ్ రిటర్న్. అన్ని పెట్టుబడి మార్గాలకు ఒకే కొలమానాన్ని వాడలేము. ఫిక్స్‌డ్ డిపాజిట్‌కు మొత్తం రాబడి, వార్షిక ప్రీమియంకు ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్, మ్యూచువల్ ఫండ్స్‌కు ఎక్స్టెండెడ్ రేట్ ఆఫ్ రిటర్న్ అనే కొలమానాలను ఉపయోగించాలి. మార్గంలో మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడి చేస్తే అవి ఏడాది దాటిన తర్వాత నుంచిగా గణించాలి.

# కరోనా సోకి బాలికకు మాట పడిపోయింది!



కొవిడ్ వైరస్ సోకి తగ్గినా ఆ తర్వాత అనేక వ్యాధులకు కారణం అవుతుందని ఇప్పటికే ఎన్నోసార్లు రుజువు అయింది. కరోనా అనంతర సమస్యలతో ఏళ్లు గడిచినా ఇప్పటికీ ఎంతో మంది బాధ పడుతూనే ఉన్నారు. ఈ క్రమంలోనే తాజాగా జరిగిన ఓ ఘటన మానవాళిని మరోసారి భయపెడుతోంది. కరోనా సోకిన ఓ బాలికకు మాట పడిపోవడం ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇంతకీ ఈ ఘటన ఎక్కడ జరిగింది. ఎలా జరిగింది. ప్రస్తుతం ఆ బాలిక పరిస్థితి ఎలా ఉందో ఈ స్టోరీలో తెలుసుకుందాం.

కరోనా మహమ్మారి. 2019 లో తొలిసారి వెలుగులోకి వచ్చిన ఈ వైరస్.. ప్రపంచం మొత్తాన్ని అతలాకుతలం చేసింది. కరోనాకు పుట్టినిల్లుగా భావిస్తున్న చైనా నుంచే ఈ వైరస్ వ్యాప్తి చెందిందని అనేక ప్రపంచ దేశాలు, సంస్థలు ఇప్పటికే ఎన్నోసార్లు చెప్పాయి. అయినా ఈ ఆరోపణలను చైనా ఖండిస్తూనే వస్తోంది. మరోవైపు.. కరోనా మహమ్మారి వచ్చి కోలుకున్న తర్వాత కూడా ఎన్నో ఆరోగ్య సమస్యలు బాధితులను వెంటాడుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే కొంతమంది కొవిడ్ సోకి చనిపోగా.. మరికొందరు కొవిడ్ అనంతర సమస్యలతో మృతి చెందిన వారు కూడా ఉన్నారు. ఇక కరోనా సోకి తగ్గిన తర్వాత వచ్చే కొన్ని వ్యాధులు దీర్ఘకాలికంగా ఉంటాయని పలు సంఘటనల ద్వారా తెలుస్తోంది. కరోనా సోకిన ఓ 15 ఏళ్ల బాలికకు గొంతు పోయిన ఘటన అమెరికాలో చోటు చేసుకుంది.

అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రంలో ఈ సంఘటన జరిగింది. కొవిడ్ సోకడం వల్ల 15 ఏళ్ల బాలికకు మాట పడిపోయింది. ఈ ఘటన వెలుగు చూడటం స్థానికంగానే కాకుండా యావత్ ప్రపంచాన్ని ఒక్కసారిగా భయభ్రాంతులకు గురి చేసింది. కొవిడ్‌కు కారణమైన సార్స్‌కోవ్ 2 వైరస్.. మానవుల నాడీ మండలాన్ని దెబ్బ తీస్తుందని చెప్పడానికి ఇదే సంకేతమని మసాచుసెట్స్ కన్ను, చెవి ఆస్పత్రి డాక్టర్లు వెల్లడించారు.

మసాచుసెట్స్‌కు చెందిన ఓ 15 ఏళ్ల బాలికకు గతంలో కొవిడ్ వైరస్ సోకింది. అయితే కొన్ని రోజులపాటు ఇంట్లోనే చికిత్స తీసుకున్నా ఆ బాలికకు వైరస్ తగ్గలేదు. దీంతో 13 వారాల తర్వాత శ్వాస కోశ సమస్యలతో ఆస్పత్రిలో చేరింది. దీంతో ఆ బాలికను పరీక్షించిన డాక్టర్లు సంచలన విషయాన్ని కనుగొన్నారు. ఆమెకు వివిధ టెస్ట్‌లు నిర్వహించిన డాక్టర్లు ఆ బాలిక స్వరపేటికలో రెండు స్వర తంత్రులూ నిస్తేజమై గొంతు సంబంధ పక్షవాతం వచ్చినట్లు కనుగొన్నారు. ఈ ఘటన డాక్టర్లనే ఆశ్చర్యపరిచింది. దీంతో ఆ బాలిక గొంతుకు డాక్టర్లు ఆపరేషన్ నిర్వహించి.. గొంతుకు రంధ్రం చేసి ఒక గొట్టాన్ని ఏర్పాటు చేసి ఊపిరి ఆడేటట్లు చేశారు. ఇలా గొంతులో గొట్టం ద్వారా శ్వాస తీసుకోవలసిన పరిస్థితి 13 నెలలపాటు కొనసాగిందని డాక్టర్లు వెల్లడించారు.

# మనదే తప్పు



పాకిస్థాన్‌లో వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్నాయి. ఇక మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రస్తుతం అవినీతి ఆరోపణలతో జైలు శిక్ష అనుభవిస్తుండగా.. మరో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ ఎన్నికల శంఖారావాన్ని మొదలుపెట్టారు. ఈ క్రమంలోనే గత ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వంపై నవాజ్ షరీఫ్ తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇమ్రాన్ సర్కార్ అనుసరించిన విధానాల కారణంగానే ప్రస్తుతం ప్రపంచ దేశాలు, సంస్థల ముందు పాకిస్థాన్ అడుక్కుతింటోందని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

ఆర్థిక సంక్షోభంతో దాయాది దేశం పాకిస్థాన్ పతనం అంచున నిలిచింది. విదేశీ మారక నిల్వలు పూర్తిగా అడుగంటిపోవడంతో అడుక్కుతినే పరిస్థితికి వచ్చింది. అప్పు కోసం ప్రపంచ దేశాలను, ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్ - ఐఎంఎఫ్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది. ఇక పాకిస్థాన్‌లో ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. అయితే ఆర్థిక సంక్షోభం నుంచి బయట పడేందుకు పాక్ ప్రభుత్వం ప్రజలపై భారీగా పన్నులను పెంచేసింది. విద్యుత్, గ్యాస్, ఇంధన ధరలను భారీగా పెంచింది. ఇక గత కొన్ని సంవత్సరాలుగా లండన్ వెళ్లిన పాక్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్.. ఎన్నికల వేళ మళ్లీ స్వదేశానికి తిరిగి వచ్చారు.

ఈ క్రమంలోనే తోషఖానా కేసులో దోషిగా తేలి మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ జైలు జీవితం అనుభవిస్తుండటం తో ఎన్నికల ప్రచారంలో నవాజ్ షరీఫ్ దూసుకెళ్తున్నారు. మరోసారి పాక్ ప్రధాని పదవిని దక్కించుకోవాలని అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే భారత్‌ను ఉద్దేశించి నవాజ్ షరీఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం పాకిస్తాన్ ఆర్థిక సంక్షోభానికి భారత్, అమెరికా కారణం కాదని.. పాకిస్థాన్ ప్రభుత్వమే కారణమని తెలిపారు. పాకిస్తాన్ ముస్లిం లీగ్ నవాజ్ పార్టీ నుంచి టికెట్ ఆశిస్తున్న అభ్యర్థు లను ఉద్దేశించి ప్రసంగిస్తూ నవాజ్ షరీఫ్ ఈ వాఖ్యలు చేశారు. గతంలో 1993, 1999, 2017 లో పాకిస్థాన్ ప్రధానిగా నవాజ్ షరీఫ్ పనిచేశారు. ప్రస్తుతం మరోసారి ప్రధాని కావాలని ఎన్నికల బరిలోకి దిగారు. ఇవాళ పాకిస్థాన్ ఆర్థిక పరిస్థితికి భారత్, అమెరికా, ఆఫ్ఘనిస్తాన్ కారణం కాదని నవాజ్ షరీఫ్ పేర్కొన్నారు. వాస్తవానికి పాక్‌ను పాకిస్థాన్ తగలబెట్టుకుందని తెలిపారు. 2018 లో పాక్ సైన్యం రిగ్గించే చేయడం ద్వారా పాకిస్థాన్‌లో ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని సంచలన ఆరోపణలు చేశారు. ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం వల్లే పాకిస్థాన్ ప్రజలకు కష్టాలు వచ్చాయని.. అదే ఆర్థిక పతనానికి కారణం అయిందని నవాజ్ షరీఫ్ వ్యాఖ్యానించారు. ఇక పాక్ సైన్యం రాజ్యాంగాన్ని ఉల్లంఘించినప్పటికీ చట్టబద్ధత కల్పిస్తారని పాకిస్థాన్ న్యాయవ్యవస్థ పైనా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మరోవైపు.. భారత్‌తో తాను మెరుగైన సంబంధాలను మెరుగుపరుచు కోవాలని అనుకున్నట్లు.. ఇటీవల నవాజ్ షరీఫ్ తెలిపారు. 1999 కార్గిల్ యుద్ధం తనకు తెలియకుండా జరిగిందని నవాజ్ వ్యాఖ్యానించ్డం ఇరు దేశాల మధ్యే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయా ంశంగా మారింది. తాను పాక్ ప్రధానిగా ఉన్న హాయాంలోనే ఇద్దరు భారత ప్రధానులు అటల్ బిహారీ వాజ్‌పేయ్, నరేంద్ర మోదీలు పాకిస్తాన్ సందర్శించిన విషయాన్ని నవాజ్ షరీఫ్ ఇటీవల గుర్తు చేశారు.

# వీసాల రెన్యూవల్ ఇక నుంచి అమెరికాలోనే!

హెచ్1 బీ వీసాదారులకు అమెరికా గుడ్‌న్యూస్ చెప్పింది. ఇక నుంచి హెచ్ 1 బీ వీసాల రెన్యూవల్ కోసం.. వీసాదారులు తమ స్వదేశానికో లేక విదేశాలకో వెళ్లాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. వచ్చే ఏడాది జనవరి నుంచి అమెరికాలోనే హెచ్ 1 బీ వీసాల రెన్యూవల్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపింది. వివిధ దేశాల నుంచి అమెరికాలో పని చేసేందుకు వెళ్లిన వారు హెచ్? 1బీ వీసాలతో అక్కడ నివసిస్తారు. అయితే ఈ హెచ్ 1 బీ వీసాలు 3 ఏళ్ల కాలవ్యవధికి అందిస్తారు. ఆ 3 ఏళ్ల తర్వాత వాటిని మళ్లీ రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో హెచ్ 1 బీ వీసాలను రెన్యూవల్ చేసుకునేందుకు ఇప్పటివరకు వీసాదారులు చాలా కష్టాలు పడాల్సి వచ్చేది. ఈ హెచ్ 1 బీ వీసాల రెన్యూవల్ కోసం వారి స్వదేశానికో లేక ఇతర విదేశాలకో వెళ్లి రెన్యూవల్ చేసుకునే వారు. అయితే ఇక నుంచి అలాంటి ప్రక్రియకు చెక్ పెడుతున్నట్లు అమెరికా తెలిపింది. అమెరికాలో పనిచేస్తున్న హెచ్ 1బీ వీసాదారులు అమెరికాలోనే వాటిని రెన్యూవల్ చేసుకునేలా కొత్త నిర్ణయాన్ని ప్రకటించింది.

ఇక నుంచి హెచ్ 1 బీ వీసా రెన్యూవల్ కోసం ఇతర దేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా అమెరికా చర్యలు చేపట్టింది. వీసా నిబంధనల్లో తాజాగా మార్పులు చేసింది. అమెరికాలోనే ఈ వీసాలను రెన్యూవల్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. అయితే ఈ ప్రక్రియలో పైలెట్ ప్రాజెక్టుగా 20 వేల హెచ్ 1 బీ వీసాలను రెన్యూవల్ చేసే ప్రక్రియకు అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే వచ్చే ఏడాది జనవరిలో ఈ ప్రక్రియను అమలులోకి తీసుకు వచ్చేందుకు అమెరికా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే హెచ్ 1 బీ వీసా రెన్యూవల్కు సంబంధించి ప్రస్తుతానికి విధివిధానాలపై ఎలాంటి స్పష్టత లేదని బ్లూమ్ బర్గ్ లా వెల్లడించింది. ఎవరు అర్హులనే విషయం ఫెడరల్ రిజిస్టర్ నోటీసు విడుదలయ్యాకే తెలుస్తుందని పేర్కొంది. అయితే ఈ హెచ్ 1 బీ వీసాల రెన్యూవల్ ప్రక్రియకు సంబంధించి వైట్ హౌస్ అధికారులు తాజాగా చర్చించి ఆమోదం తెలిపారు. ఈ క్రమంలోనే హెచ్ 1 బీ వీసా రెన్యూవల్ కోసం వీసాదారులు ఒక్క మెయిల్ చేస్తే సరిపోతుందని సూచించారు. భారత్‌లో హెచ్ 1బీ వీసాల కోసం చాలా మంది ఎదురు చూస్తూ ఉంటారని.. వాటి కోసం భారతీయులు నెలల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని.. ఈ నవంబరులో అమెరికా విదేశాంగ శాఖ ఉప మంత్రి జూలీ స్టఫ్ట్ పేర్కొన్నారు. భారతీయులకు త్వరగా వీసాలు పునరుద్ధరించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ పైలట్ కార్యక్రమంతో భారతీయులే ఎక్కువగా లబ్ధిపొందు తారని అమెరికా అధికారులు వివరించారు. గతంలో వీసా రెన్యూవల్ చేసుకునేందుకు హెచ్ 1 బీ వీసాదారులు అమెరికా దాటి వెళ్లాల్సి వచ్చేది. సాధారణంగా ఈ హెచ్ 1 బీ వీసాల గడువు మూడేళ్లు ఉంటుంది. దాన్ని మరో మూడేళ్లు పొడిగించుకోవడానికి హెచ్ 1 బీ వీసాదారులు అమెరికా నుంచి స్వదేశం తిరిగిరావడమో లేక మరేదైనా దేశానికి వెళ్లి రెన్యూవల్ చేసుకోవడమే చేసుకోవాల్సి ఉండేది. గత జూన్ నెలలో ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించినపుడు ఈ వీసా రెన్యూవల్ కష్టాలను తప్పించేందుకు డొమెస్టిక్ రెన్యూవల్ పద్ధతిని తీసుకొస్తామని అమెరికా హామీ ఇచ్చింది. దానిలో భాగంగానే తాజాగా ఈ పైలట్ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది.

# సోదరుడికి కిడ్నీ దానం చేసిన మహిళ..

ఆపదలో ఉన్న తన సోదరుడిని కాపాడటమే ఆ మహిళ చేసిన అతి పెద్ద తప్పు అయింది. కిడ్నీ పాడై అనారోగ్యంతో కొట్టు మిట్టాడుతున్న తన సోదరుడికి కిడ్నీ ఇచ్చి ఆదుకుంది అతని సోదరి. అయితే ఇదే ఆమె కాపురాన్ని కూల్చింది. తన సోదరుడికి కిడ్నీ ఇచ్చినట్లు చెప్పడంతో ఆ మహిళ భర్త విడాకులు ఇచ్చేశాడు. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లో చోటు చేసుకుంది. అయితే తన భర్త వాట్సాప్‌లోనే ట్రిపుల్ తలాక్ చెప్పడంతో ఆ మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఉత్తరప్రదేశ్‌లోని బైరియాహిలో ఓ మహిళ నివసిస్తోంది. ఆ మహిళ సోదరుడు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే అతనికి ఒక కిడ్నీ పూర్తిగా పాడైంది. అయితే ఆ వ్యక్తికి వెంటనే కిడ్నీ మార్పిడి చేయాలని డాక్టర్లు సూచించారు. ఆ వ్యక్తికి కిడ్నీ కొనేంత ఆర్థిక స్థోమత లేదు. పైగా కిడ్నీ ఇచ్చేవారు కూడా ఎవరూ దొరకలేదు. దీంతో ఆ బాధితుడి సోదరి తన కిడ్నీని ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. సోదరుడి బాధలు చూడలేక తన కిడ్నీ దానం చేయాలని నిర్ణయించుకుంది. దీంతో డాక్టర్లు ఆపరేషన్ నిర్వహించి.. ఆ మహిళ కిడ్నీని తీసి.. ఆమె సోదరుడికి విజయవంతంగా అమర్చారు. సక్సెస్‌ఫుల్‌గా ఆపరేషన్ పూర్తి కాగా.. ప్రస్తుతం ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు. అయితే ఈ ఆపరేషన్ తర్వాతే అసలు ఘటన జరిగింది. అనారోగ్యంతో బాధపడుతున్న తన సోదరుడికి కిడ్నీ దానం చేసినట్లు ఆ మహిళ.. సౌదీ అరేబియాలో పని చేస్తున్న తన భర్తకు వెల్లడించింది. ఆ విషయం విన్న మహిళ భర్త తీవ్ర ఆగ్రహానికి గురయ్యాడు. ఫోన్‌లోనే తన భార్యను దూషించాడు. అనంతరం ఆ వ్యక్తి అంతటితో ఆగకుండా ఏకంగా వాట్సాప్ ద్వారా ఆ మహిళకు ట్రిపుల్ తలాక్ చెప్తూ విడాకులు ఇచ్చేశాడు. ఆ వ్యక్తి ప్రశంసించడం పోయి తిట్టడంతో ఆ మహిళ షాక్ అయింది. తనకు తన భర్త సౌదీ అరేబియా నుంచి వాట్సాప్‌లో ట్రిపుల్ తలాక్ చెప్పడంతో సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# ఎమ్మెల్యే బాలు నాయక్ గెలుపు పట్ల మొక్కులు చెల్లించుకున్న భక్తులు



**చింతపల్లి.డిసెంబర్ 24 మన సాక్షి.**

దేవరకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా నేనావత్ బాలునాయక్ గెలిస్తే శ్రీ రామలింగేశ్వర స్వామి కి 101 కొబ్బరికాయలు కొడతానని తీదేడు గ్రామ సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి తల్లి కాయితి జంగమ్మ ఎన్నికల ముందు మొక్కుకున్నారు.

ఆదివారం తీదేడు గ్రామ సమీపంలో గల శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయానికి చేరుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆమె 101 కొబ్బరికాయలను కొట్టారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ తల్లి గారి కోరిక తీర్చేందుకు గుట్ట పైకి తీసుకువెళ్లి ప్రదక్షణ చేసి స్వామి వారికి నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సందర్భంగా సర్పంచ్ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని ప్రజా సంక్షేమ పాలన కొనసాగుతుందని. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అది సాధ్యమవుతుంది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు పథకాల అమలుతో రాష్ట్రం మరింత పురాభివృద్ధి చెందుతుందని ప్రతి ఒక్క నిరుపేదకు ప్రభుత్వం అందించే పథకాలు చేరుతాయి అన్నారు.

దేవరకొండ నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కే సమర్థుడు అన్నారు. దేవరకొండ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పరచేందుకు బాలు నాయక్ అందరి సహకారంతో ముందుకు వెళుతున్నారన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు వారికి సహకరించి దేవరకొండ నియోజకవర్గం అభివృద్ధికి చేయూత నందిద్దమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాయితి జితేందర్ రెడ్డి, కవిత, మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాస్ యాదవ్, నిర్మల, మర్రు ప్రభాకర్ రావు, శ్రీదేవి, కాయితి వెంకటరెడ్డి జయమ్మ, మాజీ సర్పంచ్ రావు వెంకట నరసింహారావు, ఎడమోని శ్రీనివాస్, గుణ మోని,వెంకటేష్, ఉడుత లింగయ్య, నిమ్మల ఇందిరమ్మ, కాయిత్ వసంతం, కాయితి కల్పన, కాయిత యాదమ్మ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హత్యాయత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**నల్గొండ డిసెంబర్ 24 మన సాక్షి**



తనపై కుట్రపన్ని తనను హత్య చేయడానికి వేటకొడవల్ల తో వెంటపడి భయభ్రాంతులకు గురిచేసిన గోటిముక్కల వీరబ్రహ్మచారి, శ్రీనివాసాచారి, నారాయచారి , నిర్మల వీరికి సహకరిస్తున్న డిసిసిబి మాజీ చైర్మన్ ఎడవెల్లి విజయందర్ రెడ్డిలపై చట్టపరమయిన చర్యలు తీసుకొని తనను కాపాడాలని జిల్లా ఎస్పీ కి ఫిర్యాదు చేసినట్లు గోట్టిముక్కల మాధవాచారి తెలిపారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈనెల 17వ తారీఖున మా సొంత గ్రామమైన అనుముల మండలం ఇబ్రహం పేట గ్రామ రెవెన్యూ సర్వేనెంబర్ 335లో మా తండ్రి పేరు మీద ఉన్న ఎకరం 30 గుంటల భూమి ఉన్నదని ఈనెల 18న వ్యవసాయ సాగు చేసుకోవడానికి వెళుతుండగా పైన తెలిపిన వ్యక్తులు నాపై వేటకుడవులతో అత్యాయత్నానికి పాల్పడ్డారని ఆరోపించారు. వారి నుండి తప్పించుకొని ప్రాణాలను కాపాడుకుందామని తెలిపారు. హాలియా సీఐ కి ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో ఎస్పీకి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. సంబంధిత అధికారులు వారిపై చర్యలు తీసుకొని ప్రాణప్రయస్థితి నుండి కాపాడాలని కోరారు.

## అతిపెద్ద క్రిస్మస్ ట్రీ ఇదే!



**శేరిలింగంపల్లి (డిసెంబర్ 24)మన సాక్షి**

క్రిస్మస్ పండుగ రోజున చర్చిలలో, ఇళ్లల్లో విద్యుద్దీపాల వెలుగులో మనకు ధగధగమనే ఓ చెట్టు కనిపిస్తుంది. అదే క్రిస్మస్ చెట్టు. అయితే జర్మనీలోని డోర్ట్మండ్ నగరంలో క్రిస్మస్ వేడుకను అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. ఏటా ప్రపంచంలోనే అతిపెద్ద క్రిస్మస్ ట్రీని ఇక్కడే ఏర్పాటు చేస్తారు. ఇది 150 అడుగుల ఎత్తు, 40 టన్నుల బరువుతో ఉంటుంది. ఈ ఎత్తైన ట్రీని తయారు చేయడానికి నగరవాసులంతా నాలుగు వారాలపాటు కృషి చేస్తారట.

## క్రిస్మస్ పండుగ వేడుకలకు ముస్తాబైన చర్చిలు



**మన సాక్షి : 24, డిసెంబర్**

వెలేరుపాడు , కుకునూరు : క్రిస్మస్ పండగ సందర్భంగా వెలేరుపాడు, కుకునూరు మండలాలలో చర్చిలు విద్యుత్ దీపాలతో రంగు రంగు కాంతులతో అలకరించారు. క్రైస్తవ ప్రార్ధనా మందిరాలు నూతన శోభను సంతరించు కున్నాయి.సోమవారం మేరీ క్రిస్మస్ సందర్భంగా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుటకు ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## మల్లికార్జున గౌడ్ కి శ్రీకృష్ణ కాలనీ వాసుల నివాళులు



**శేరిలింగంపల్లి, (డిసెంబర్ 24 )మన సాక్షి**

శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల గ్రామంలో మాజీ మహబూబనగర్ పార్లమెంట్ సభ్యులు కేంద్ర మాజీ మంత్రి మల్లికార్జున్ గౌడ్ పటేల్ వర్ధంతి సందర్భంగా వారి గాట్ దగ్గర ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని పూలమాలయసి నివాళులర్పించిన శ్రీకృష్ణ కాలనీవాసులు. కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో శ్రీకృష్ణ కాలనీ ఏర్పాటుకు కృషి చేసిన గొప్ప వ్యక్తి అంటూ తెలియజేసిన ఎల్ వెంకటేష్ ముదిరాజ్ ఈ కార్యక్రమంలో వి. మల్లేష్ వి. రాజు జి శివ ఎల్. నరసింహ వి. రాజు తదితరులు పాల్గొన్నారు

## ముగ్గురు సంతానం ఉన్న పోటీకి అనుమతించాలని విజ్ఞప్తుల వెల్లువ



**శంకర్‌పల్లి: డిసెంబర్ 24: (మన సాక్షి న్యూస్):**

తెలంగాణ రాష్ట్ర స్థానిక ఎన్నికల గ్రామ సర్పంచ్ పాలకవర్గంలోని ముగ్గురు సంతానం ఉన్నవారికి పోటీ చేసే అవకాశం కల్పించాలని శంకర్‌పల్లి మండలం నుంచి విజ్ఞప్తులు వెల్లివిరిచాయి. ఈ నేపథ్యంలో పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ..... పూర్వ ఉమ్మడి రాష్ట్రంలో 1996 తర్వాత జన్మించిన సంతానంలో ముగ్గురు పిల్లలు ఉంటే స్థానిక ఎన్నికలలో గ్రామ సర్పంచి ఎన్నికలలో పోటీ చేసే అవకాశం కల్పించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి స్థానిక నాయకుల ద్వారా విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలలో 1996 తర్వాత పుట్టిన సంతానంలో ముగ్గురు పిల్లలున్న పోటీ చేసే అవకాశం 2018లో అధికారకంగా ఆదేశించిన సంగతి తెలిసిందే. ఇదే అంశంపై గ్రామ సర్పంచులు కూడా వర్తింపజేయాలని త్వరలో ఈ విషయంపై చర్చిస్తామని తెలిపిన సంగతి కూడా తెలిసిందే. ఇందులో భాగంగా ఇదే మాదిరిగా గ్రామ సర్పంచులు, వార్డ్ మెంబర్లకి పోటీ చేసేందుకు అర్హత కల్పించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని 26 గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని వినతి పత్రం అందజేస్తామని నాయకులు పేర్కొన్నారు.

## ప్రమాదాలు జరగకుండా ప్రజలు సహకరించాలి: శంకర్‌పల్లి సీఐ వినాయక్ రెడ్డి

**శంకర్‌పల్లి: డిసెంబర్ 24: (మన సాక్షి న్యూస్):**



కొత్త సంవత్సరం 2024 జనవరి 1వ తేదీని దృష్టిలో ఉంచుకొని, ప్రమాదాల నివారణ చర్యలు ప్రతి ఒక్కరూ పాటించాలని శంకర్‌పల్లి సిఐ వినాయక్ రెడ్డి పట్టణ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రతి ఏరియాలో స్పెషల్ డ్రైవ్ పెట్టి వెహికల్ చెకింగ్ చేస్తున్నట్లు తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపేవారిని గుర్తించి అట్టి వాహనలు సీజ్ చేసి వారి పైన కఠినమైన చర్యలు తీసుకోనబడతాయని పేర్కొన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా, త్రిబూల్ రీడింగ్, రాంగ్ రూట్ నడిపే వాహనాలు నడిపిన వారి పై చర్యలు ఉంటాయన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలు, సగం నెంబర్ వున్న వాహనాలు, సరైన నెంబర్ లేనటువంటి వాహనాలను గుర్తించి అట్టి వాహనాలను సీజ్ చేస్తున్నట్లు వెల్లడించారు.

## ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపిన వై వి గౌడ్



**రంగారెడ్డి జిల్లా, మాడ్గుల ప్రతినిధి, డిసెంబర్ 24: మన సాక్షి:**

కల్వకుర్తి నియోజక వర్గానికి నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన కసిరెడ్డి నారాయణరెడ్డి ని ఆదివారం కల్వకుర్తి అభివృద్ధి సాధన కమిటీ చైర్మన్, శుద్ధపల్లి సర్పంచ్ యాచారం వెంకటేశ్వర్లు గౌడ్ ఘనంగా సత్కరించారు. హైదరాబాదులోని ఎమ్మెల్యే నివాసంలో కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వై వి గౌడ్ శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కల్వకుర్తి నియోజకవర్గం ప్రజలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేయాలని, మొదటగా ప్రధానంగా కేఎల్ఐ డి-82 కాలువ ద్వారా మాడ్గుల మండలం నాగిళ్ల వరకు సాగునీరు అందించడానికి ప్రత్యేక చొరవ చూపాలని ఎమ్మెల్యే కసిరెడ్డిని కోరినట్లు వైవిగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండోమాజీ చైర్మన్ గోపాల్ రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల చెంతకు చేరిన ఎమ్మెల్యే చిట్టెం



**నారాయణపేట టౌన్, డిసెంబర్ 24 మనసాక్షి :-**

నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికై 20 రోజుల వ్యవధిలోనే ప్రజల చెంతకు చేరారు. జిల్లా కేంద్రంలో నేరుగా ప్రజల నివాసాల దగ్గరికి వెళ్లి వారు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని వారి ఆధార అభిమానులను చురగున్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ, రెండవ, మూడవ వార్డులలో ఆదివారం ఉదయం 7.30 గంటలకు స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి ఒకటి,రెండు,మూడో వార్డులో పర్యటించారు. వార్డులలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా త్రాగునీటి సమస్య గురించి వాటర్ లైన్మెన్ అంజి , డ్రైనేజీ వ్యవస్థ గురించి ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ చెన్న కేశవులను అడిగి తెలుసుకున్నారు. ఒకటో వాడు మూడో వార్డులో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని పూడికతీత వారంకు ఒకసారి తీస్తున్నారని వార్డు ప్రజలు ఎమ్మెల్యేకు తెలిపారు. డ్రైనేజీ లో పొడికితీతను రోజు తీసేయాలని ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్కు ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజలు మూడో వార్డులో ప్రజలు ట్రాన్స్ఫార్మర్ కావాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఎలక్ట్రికల్ ఏఈ, లైనింగ్ ఇన్స్పెక్టర్కు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపాలిటీ అధికారులు, ఎలక్ట్రికల్ అధికారులు ఏఈ మహమ్మద్ రఫీ, లైన్ ఇన్స్పెక్టర్ రాఘవాచారి, లైన్మెన్ బండి ఆనంద్, ఒకటవ రెండవ మూడవ వాడు కౌన్సిలర్లు జొన్నల అనిత, సత్యా రఘుపాల్ రెడ్డి, కౌన్సిలర్ సలీం, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రాముని అక్షింతలు వితరణ కార్యక్రమం



**మన సాక్షి : 24, డిసెంబర్ కుకునూరు :**

హిందువుల ఆరాధ్య దైవం అయినటువంటి శ్రీ రాముని పవిత్ర అక్షింతలు అయోధ్య పురము నుండి దేశంలో ప్రతీ మారుమూల పల్లెకు చేరాలనే సంకల్పంతో అయోధ్య రామ తీర్థ క్షేత్ర ట్రస్టు వారు పంపినటువంటి అక్షింతలను శనివారం ,కుకునూరు రామాలయం నందు పంపిణీ కార్యక్రమం చేశారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఆంధ్రా ప్రాంత కార్యదర్శి భూపతిరాజు సుబ్బరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ,రాముని జన్మస్థలమైనటువంటి అయోధ్యలో 500 సంవత్సరాల నిరీక్షణ తరువాత భవ్యమైన రామమందిర నిర్మాణం జరిగిందని,శ్రీరాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా పూజ చేసిన అక్షింతలు ప్రతీ ప్రాంతానికి ప్రతీ జిల్లాకి ప్రతీ మండలానికి ప్రతీ గ్రామానికి ప్రతీ మారుమూల పూరి గుడిసె వరకు చేరాలని సంకల్పంతో అయోధ్య రామతీర్థం క్షేత్ర ట్రస్టుకు విశ్వహిందూ పరిషత్ సహకరిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ ఎఫ్ మండల కన్వీనర్ ముప్పాల. సాంబశివరావు,బట్టు. వీరబాబు,వి.హెచ్.పి.సభ్యులు బొల్లు ప్రసాద్,ములిశెట్టి నాగు,కోటగిరి. సత్యనారాయణ,ఆలయ పూజారి శంఖుబాబు,బొల్లు. రాము,సతీష్,నకరకంటి. వెంకటేశ్వర్లు,కుమారి,ములకలపల్లి. సునీత,మరియ అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు

**గోపులారం సర్పంచ్ పొడువు శ్రీనివాస్**



శంకర్‌పల్లి: డిసెంబర్ 24: (మన సాక్షి ): క్రైస్తవ సోదర, సోదరీమణులు అందరూ సంతోషంతో క్రిస్మస్ పండుగ నిర్వహించుకోవాలని శంకర్‌పల్లి మండలం గోపులారం సర్పంచ్ పొడువు శ్రీనివాస్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆయన నివాసంలో మాట్లాడుతూ క్రీస్తు పుట్టిన రోజున క్రైస్తవ సోదరులు అత్యంత ఘనంగా క్రిస్మస్ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. గ్రామ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఏసుక్రీస్తుకు ప్రార్థనలు చేయాలని క్రైస్తవులను కోరారు. క్రైస్తవ సోదరులకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

# సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

**రంగారెడ్డి జిల్లా, మాడ్గుల ప్రతినిధి, డిసెంబర్ 24: మన సాక్షి :**



మండలంలోని ఇర్విన్ గ్రామపంచాయతీ పరిధిలోని దిల్ వార్ ఖాన్ పల్లిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి వినతి పత్రం అందజేశారు. దిల్ వార్ ఖాన్ పల్లి గ్రామస్తులు హైదరాబాద్ లో ఎమ్మెల్యే నివాసంలో కసిరెడ్డి నారాయణ రెడ్డి నీ మర్యాద పూర్వ కంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా గ్రామంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరిస్తూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి గ్రామంలో నెలకొన్న సమస్యల నమస్కారానికి ప్రత్యేక చొరవ తీసుకొని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఠాగూర్ బాలాజీ సింగ్, సుద్దపల్లి సర్పంచ్, తెలంగాణ పంచాయతీ రాజ్ చాంబర్ కార్యదర్శి యాచారం వేంకటేశ్వర్లు గౌడ్, సూదిని శ్రీనివాస్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాలకుర్ల శ్రీనివాస్ గౌడ్, పాపిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య , ఎన్నమల్ల గోవర్ధన్, కిరణ్, వెముల రమేష్,సలీమ్ , శ్రీకాంత్,వంశీ, శేఖర్,గద్ద రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ దైవచింతను అలవర్చుకోవాలి

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా,ఆమనగల్లు ప్రతినిధి,డిసెంబర్ 24 మనసాక్షి:**

ఆదివారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఎమ్మెల్యేని సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి పెద్ద పీట వేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్,ఎంపీపీ అనిత విజయ్,కౌన్సిలర్ సోనా, సర్పంచ్, వెంకటేశ్వర్లు గౌడ్,కాంగ్రెస్ జిల్లా నాయకులు కృష్ణ నాయక్,అప్పం శ్రీనివాసులు,అధ్యక్షులు జగన్,పాల్గొన్నారు

## మేరీ క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చీలు



**రంగారెడ్డి జిల్లా,ఆమనగల్లు ప్రతినిధి,డిసెంబరు 24 మనసాక్షి:**

ఆమనగల్లు పట్టణ కేంద్రంలోని ఫిలదేల్ఫియా చర్చిని ఆదివారం రాత్రి రంగురంగుల దీపాలతో అలంక రించారు. క్రైస్తవ ప్రార్థనా మందిరాలు నూతన శోభను సంతరించు కున్నాయి.సోమవారం మేరీ క్రిస్మస్ సందర్భంగా వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుటకు ప్రత్యేక ప్రార్థనల కోసం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## కాలనీ వాసుల పోరాటం ఫలించిన ఆరేండ్ల కష్టం

### సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కాలనీ వాసులు



**రంగారెడ్డి జిల్లా,ఆమనగల్లు ప్రతినిధి,డిసెంబర్ 24 మనసాక్షి:**

ఆమనగల్లు పట్టణ కేంద్రంలో నిషేధిత జాబితాలో ఉన్న 1457 1459 సర్వే నెంబర్లలో క్రయ విక్రయాలు ఇంటి నిర్మాణాలకు గత నెలలో ప్రభుత్వం నుండి అనుమతి లభించింది. దీంతో విద్యానగర్ కాలనీ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీ వాసుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి హాజరైనారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు.ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్,చైర్మన్ రాంపాల్,వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ సోనా,సంఘ సేవకులు పాపిశెట్టి రాము, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జగన్, కాలనీ వాసులు సుదర్శన్ రెడ్డి, శేఖర్, జంగయ్య, వెంకటేశ్వర, పత్య, పాండు, పర్వతాలు ఆరిఫ్, ఆనంద్,రాములు,యాదగిరి, బాబు, సత్యం,పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక భావంతో మానసిక ప్రశాంత లభిస్తుంది : కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిసెంబర్ 24 మనసాక్షి**

ఆధ్యాత్మిక భావంతో మానసిక ప్రశాంత లభిస్తుందని స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రామ యాదవ్ అన్నారు. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని మిరిజాలగూడలో శ్రీకాంత్, కాలనీవాసులు ఏర్పాటుచేసిన వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులతో ఆశీర్వచనం తీసుకున్నారు. అనంతరము సామూహిక అన్నదానం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాము యాదవ్, నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర వేడుకలకు అనుమతులు తప్పనిసరి

### ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్




నూతన సంవత్సరము సందర్భంగా డిసెంబర్ 31న నిర్వహించే వేడుకలకు అనుమతి తీసుకోవాలని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బధ్యనాద్ చౌహాన్ తెలిపారు. లిక్కర్ వాడకం కోసం అనుమతి తీసుకోవాలని, ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మండలాల్లోని ఫామ్ హౌస్,ఫంక్షన్ హాల్, రీసర్ట్ లలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుటకు ఎక్సైజ్ శాఖ అనుమతి తప్పక తీసుకోవాలని,బహిరంగ ప్రదేశాలలో,ప్రభుత్వ స్థలాలలో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ తెలిపారు.

## సంకట విమోచన ఆంజనేయ స్వామి సన్నిధిలో ఘనంగా హన్మత్ వ్రతం

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డిసెంబర్ 24 మన సాక్షి**



ఆనంద్ బాగ్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయం లో వేంచేసి ఉన్న శ్రీ సంకట విమోచన ఆంజనేయ స్వామి సన్నిధిలో ఆదివారం హోన్మత్ వ్రతం పూజాకార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ప్రాతః కాలం లో స్వామివారికి ఫలారస సహిత పంచామృత అభిషేకం, సింధూర పూజ, విశేష వస్త్ర, పుష్ప అలంకరణ ను ఆలయ అర్చకులు తులసి వెంకట రమణా చార్యులు నిర్వహించారు.అనంతరం మార్గశిర మాసం శుద్ధ త్రయోదశి నీ పురష్కరించుకొని హోన్మత్ వ్రతం పూజ, మహనివేదన , హారతి, మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ముదుంబై వేంకట రమణా చార్యులు, ఆలయ క్లర్క్ సంద్ర సుధాకర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## 31 కుటుంబాలను పరామర్శించిన ప్రసాద్ రెడ్డి

**నేలకొండపల్లి, డిసెంబర్ 24 మన సాక్షి:**



మండలంలోని వివిధ గ్రామాలలో ఇటీవల మృతి చెందిన 31 కుటుంబాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాద్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. మృతుల కుటంబాలకు వెళ్లి మృతుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. ఆర్థిక సహాయం ను అందించారు. ఎవరూ ఆధైర్యపడోద్దని శ్రీనన్న అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. పలువురు నూతన వధువరులను ఆశీర్వదించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తల తో ప్రత్యేకంగా మాట్లాడారు.. ఈ కార్యక్రమంలో సోసైటి చైర్మన్ గూడవల్లి రాంబ్రహ్మం.. నేలకొండపల్లి ఉప సర్పంచ్ లక్కం ఏడుకొండలు, నాయకులు కొడాలి గోవిందరావు, రమేష్, భద్రయ్య. వెంకన్న, కొండబాల రాంబాబు, అంజిని, సీతారాములు. మైశా శంకర్, గుండా బ్రహ్మం. పిట్టల వెంకన్న. రాయపూడి శ్రీనివాసరావు, కడియాల నరేష్, గోరెంట వెంకటేశ్వరరావు..హనుమంతరావు, ఉండమోదుగుల వెంకటేశ్వర్లు, జెర్రిపోతుల సత్యనారాయణ, బోయిన వేణు, వివిధ పంచాయతీ సర్పంచ్లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ ముత్యాలమ్మ దేవాలయాన్ని సందర్శించిన సి ఐ



**మన సాక్షి : 24, డిసెంబర్ కుకునూరు :**

మండలంలోని పెదరావిగూడెం పంచాయితిలోని పాములేరు నదీ తీరాన కొలువై ఉన్న శ్రీ శ్రీ ముత్యాలమ్మ దేవాలయాన్ని సి ఐ శ్రీనివాసు, దంపతులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని దేవాలయ కమిటీ చైర్మన్ ఆచంటి. మాధవరావు సి ఐ దంపతులకు పూజా కార్యక్రమాన్ని దగ్గరుండి అమ్మవారి పూజా కార్యక్రమాలల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## సిఎస్ఐ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**లక్షెట్టిపేట్ డిసెంబర్ 24 (మన సాక్షి)బీ**

లక్షెట్టిపేట్ మున్సిపాలిటీ లోని సిఎస్ఐ చర్చ్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుగుతున్నాయి,క్రిస్మస్ మాస్ ఈవ్ భాగంగా పాస్టర్ డేవిడ్ పాల్ మాట్లాడుతూ అనేక ఇతర సాంస్కృతిక సంప్రదాయాలు, అనుభవాలు కూడా ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ ఈవ్‌తో ముడిపడి ఉన్నాయి, వీటిలో కుటుంబం , స్నేహితుల కలయిక, క్రిస్మస్ కరోల్స్ పాడటం, క్రిస్మస్ దీపాలు , చెట్లు , ఇతర అలంకరణల ప్రకాశం , ఆనందాన్ని పొందడం , చుట్టడం, మార్పిడి, బహుమతులు తెరవడం, శాంతా క్లాజ్ , ఫాదర్ క్రిస్మస్ , క్రైస్ట్‌కైండ్, సెయింట్ నికోలస్‌తో సహా లెజెండరీ క్రిస్మస్ గిఫ్ట్-బేరింగ్ ఫిగర్‌లు కూడా క్రిస్మస్ ఈవ్‌లో పిల్లలకు బహుమతులను అందించడానికి వారి వార్షిక ప్రయాణానికి బయలుదేరుతారని తరచుగా చెబుతారు,అనేక మంది వివిధ నాటకాల తో ఆకట్టుకున్నారు,ఈ క్రిస్మస్ ఈవ్ లో తరాల విజయ్ దర్శకత్వంలో చేసిన యేసు జననం ధర్మ ప్రధాన ఆకర్షణ గా నిలిచి పలువురుని ఆకట్టుకుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో లో క్రైస్థవ సోదరులు సోదరీమణులు పాల్గొన్నారు.




## కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షునిగా మోహన్ ఎన్నిక

**మాడుగులపల్లి: డిసెంబర్ 24 మన సాక్షి**



మాడ్గులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులుగా మండలంలోని కేశవపురం గ్రామానికి చెందిన గనిపల్లి మోహన్ ఎన్నికయ్యారు.ఈ మేరకు నల్గొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్ రెడ్డి సమక్షంలో మోహన్ కు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ యూత్ అధ్యక్షునిగా ఎన్నికకు సహకరించిన జిల్లా మంత్రివర్యులు శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,నాగార్జున సాగర్ ఎమ్మెల్యే శ్రీ జయవీర్ రెడ్డి , జడ్పిటిసి సైదులు, వేణుగోపాల్ రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులకు లకు ధన్య వాదాలు తెలిపారు.పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.

## టిప్పర్లు ను అడ్డుకున్న కొత్తకొత్తూరు గ్రామస్తులు

**నేలకొండపల్లి, డిసెంబర్ 24 మన సాక్షి:**



మండలం లోని కొత్తకొత్తూరు గ్రామం వద్ద ఆదివారం టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. మండలం లోని నాచేపల్లి, బైరవునిపల్లి, కొత్తూరు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. టిప్పర్లు హెవీ లోడ్ వలన రహదారులు దెబ్బతినటంతో పాటు, ప్రజలకు ఇబ్బంది అవుతుందని, దుమ్ము, దూళి ఇంట్లో కి చేరుతుందని, చిన్న పిల్లలు రోడ్డు దాటేందుకు కష్టంగా ఉందని గ్రామస్తులు అగ్రహించారు. పలుమార్లు చెప్పినప్పటికీ టిప్పర్లు యాజమానులు పట్టించుకోకపోవటంతో ఆదివారం కొత్తకొత్తూరు-నాచేపల్లి రహదారి పై టిప్పర్ల ను దాదాపు గంట పాటు నిలిపివేశారు. చివరకు టిప్పర్లు ఈ రహదారి వెంట రానీయమని చెప్పటంతో టిప్పర్ల ను అక్కడినుంచి పంపించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల అధైర్య పడవద్దు

**మర్రిగూడ, డిసెంబర్ 24, మనసాక్షి:**



బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం చండూరులో భవాని ఫంక్షన్ లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మునుగోడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటమి గెలుపు సహజమని అగ్ర పార్టీలో ఉన్న అధికార పార్టీకి మునుగోడు నియోజక అభివృద్ధి విషయంలో బిఆర్ఎస్ పార్టీ తరఫునుండి సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలియజేశారు,గతములో అధికారం లేనందున రాజీనామా చేసిన ప్రస్తుత ఎమ్మెల్యే ప్రభుత్వ ఏర్పాటు ఉండడంతో అభివృద్ధిని పరుగులు పెట్టించాలని అన్నారు,

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి రెడ్డి , చండూరు జెడ్పిటిసి కర్నాటి వెంకటేశం , మండల పార్టీ అధ్యక్షులు బొమ్మరబోయిన వెంకన్న ,చండూరు మున్సిపాలిటీ చైర్మన్ తోకల చంద్రకళ వెంకన్న, రైతు సేవా సాకార సంఘం చైర్మన్ డిసిసిబి డైరెక్టర్ కోడి సుష్మ వెంకన్న , మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుర్రం మాధవి వెంకట్ రెడ్డి , చండూరు మున్సిపాలిటీ కౌన్సిలర్లు, చండూరు మండల ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ వార్డు అధ్యక్షులు, వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు,ముఖ్య నాయకులు ,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పైనంపల్లి సోసైటీ ఉపాధ్యాక్షుడు పదవికి 30 న ఎన్నికలు.

**నేలకొండపల్లి**



మండలం లోని పైనంపల్లి ప్రాధమిక వ్యవసాయ సహకార పరపతి ' సంఘం లో ఉపాధ్యాక్షుడు పదవి కోసం ఎన్నిక జరుగనున్నది. ఈ నెల 30 న సోసైటీ కార్యాలయంలో ఎన్నిక ను నిర్వహించేందుకు సహకార అధికారులు ఏర్పాట్లు చేశారు. గత 6 నెలల క్రితం ఉపాధ్యాక్షుడు గా ఉన్న యడ్లపల్లి విజయ్ భాస్కర్ వ్యక్తిగత కారణాల వలన ఉపాధ్యాక్షుడు పదవి కి రాజీనామా చేశారు. ఆ ఖాళీ ని భర్తీ చేసేందుకు సహకార అధికారులు ఈ నెల 27 న నోటిఫికేషన్ విడుదల చేసి, 30 న ఎన్నికల ను నిర్వహించనున్నట్లు సహకార అధికారులు తెలిపారు. ఈ సంఘంలో సొసైటీ చైర్మన్ తో పాటు మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉన్నారు. గతంలో ఉన్న రాజకీయాలకు.... ప్రస్తుత రాజకీయాలు మారటంతో ఎన్నిక పై 'ఉత్కంఠత నెలకొంది. రాజకీయాలకు అతీతంగా జరిగే ఎన్నికలు అయినప్పటికీ పూరి సాయిలో రాజకీయాల కనుసన్నలలోనే ఎన్నికలు.

# తాటిచెట్టు పైనుండి పడి గీతకార్మికుడు మృతి



**లక్షెట్టిపేట్ డిసెంబర్ 24 (మన సాక్షి)బీ**

లక్షెట్టిపేట మండలం చందారం గ్రామానికి చెందిన పొన్నం వెంకగౌడ్ (62)సంవత్సరాల గీత కార్మికుడు తాడిచెట్టుపై నుండి ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. వెంకగౌడ్ ఉత్కూర్ గ్రామంలో ఒక ఇంట్లో అద్దెకు ఉంటూ కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం చెట్టు ఎక్కి కళ్ళు గీస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి గాయపడ్డాడు స్థానికులు కుటుంబసభ్యులు అతని గమనించి వైద్యం కోసం లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రవేట్ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు మృతుడి కూతురు మంజుల చెప్పిన వివరాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

# తుక్కాపూర్ లో భరత్ సంకల్ప్ యాత్ర



**కొల్చారం, డిసెంబర్ 24, మన సాక్షి**

మెదక్ జిల్లా కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్ లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డ్రోన్ ద్వారా మందుల పిచికారి ప్రదర్శన నిర్వహించారు. రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు సరఫరా చేస్తుందని వీటిని రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ మాధవి శ్రీశైలం,వ్యవసాయ విస్తరణ అధికారిని రోజా, పంచాయతీ కార్యదర్శి స్వాతి ప్రియా,ఫాక్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారు శ్రీపతి, ప్రణయ్,ఏఎన్ఎం సురేఖ, లక్ష్మి, సిఏ లావణ్య, గ్రామస్థులు సంగమ్మ, నాగమణి, సుశీల, అంబాజీ,ఆరే శివాజీ సత్యయ్య, శంకర్, విట్టల్, వీరప్ప, సంగమేశ్వర్, నర్సింలు,విష్ణు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మందమర్రి, డిసెంబర్ 24, మన సాక్షి.**

మందమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల( 1990-91) బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థులు పట్టణంలోని శ్రీ మంజునాథ గార్డెన్స్ లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. స్నేహమేరా జీవితం స్నేహమేరా శాశ్వతం అంటూ సాగే పాట వారి కలయికతో నిజమైనది. ఈ సందర్భంగా కార్యక్రమానికి వందకు పైగా పూర్వ విద్యార్థులు హాజరై వారి అనుభవాలను నెమరు వేసుకున్నారు అనంతరం రుచికరమైన వంటలను ఆస్వాదించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి ఖండాలు దాటి వచ్చిన అమెరికాలో సైంటిస్ట్ గా పని చేస్తున్న కొట్టే శ్రీనివాస్, బెంగళూరు నుండి మట్టపర్తి వెంకటేశ్వర్లు హాజరై తమ స్మృతులను తోట విద్యార్థులతో గుర్తు చేసుకున్నారు. అలుమిని వెల్ఫేర్ సభ్యులు బైరం రాము, ఏడుకొండల పవన్ కుమార్, పారుపల్లి సంజీవ్, కుర్ర శ్రీనివాస్, యోగానంద్,దాసరి రాజనర్సు,ఉప్పులేటి నరేష్, జాతీయ కళాకారుడు (జానపద ) అంతడుపుల నాగరాజు, మట్టపర్తి వెంకటేశ్వర్లు, కొత్తపల్లి రమేష్, మహిళా ప్రతినిధులు పార్వతి విజయ రాజేశ్వరి ప్రసన్న, ధనలక్ష్మి సుజాత,యశోద తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**కనగల్ డిసెంబర్ 24, మన సాక్షి:**

మండలంలోని జి. యడవల్లి లో ఆదివారం ఘనంగా క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు. స్థానిక పునీత జోసప్ప ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. క్రిస్మస్ పండుగ వేడుకల్లో కనగల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం అనూప్ రెడ్డి పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు మతసామరస్యానికి ప్రతీకలు అన్నారు. క్రిస్మస్ పండుగ ఆయురారోగ్యాలు సుఖశాంతులు అందించాలని ప్రభువును వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ రాజేష్, కె.వి.ఆర్ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు పోలే విజయ్ కుమార్, జంగాల దుర్గాప్రసాద్, కలకూరి వెంకన్న, పురం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వాన్ని చాటుకున్న తోటి మిత్రులు

## - కుటుంబానికి ఆర్థిక సహాయం



**దుబ్బాక, డిసెంబర్ 24, మనసాక్షి :**

ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిన్ననాటి మిత్రుడు కానుగంటి నర్సింలు కుటుంబానికి 2005-06 సంవత్సరం పదవ తరగతికి చెందిన తోటి మిత్రులు మానవత్వాన్ని చాటుకొని మృతి చెందిన స్నేహితుని కుటుంబానికి తమ వంతుగా రూ. 19000 ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా తమ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అధర్య పడకుండా ఉండాలని కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు కరుణాకర్, నరేష్ ,ప్రవీణ్ ,మధుసూదన్ ,ఎల్లం సార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**దుబ్బాక, డిసెంబర్ 24, మనసాక్షి :**

తిమ్మాపూర్ లో 2008-09 బ్యాచ్ సందడి వాతావరణం నెలకొంది. వారంతా చిన్ననాటి స్నేహితులు.. ఒకేచోట చదువుకున్నారు.. పదో తరగతి పూర్తయ్యాక కొంతమంది ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని తిమ్మాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జడ్పిహెచ్ఎస్ తిమ్మాపూర్ 2008-09 బ్యాచ్ కిచెందిన పూర్వ విద్యార్థిని, విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులు నేర్పిన పాఠాలను తరగతి గదిలో చేసిన అల్లర్లను గుర్తు చేసుకోగా సుమారు 40 మంది పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరవడంతో సందడి నెలకొంది. ఇక నుంచి అందరూ టచ్లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతో పాటు ఈ మధుర జ్ఞాపకాలను. తమ సెల్ ఫోన్లల్లో బంధించునున్నారు.

# మృతదేహానికి నివాళులర్పించిన మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి



**మాడుగులపల్లిబీ డిసెంబర్ 24 మనసాక్షి**

మాడుగులపల్లి మండల పరిధిలోని మర్రిగూడెం గ్రామానికి చెందిన నమస్తే తెలంగాణ పత్రిక అధిపతి కట్ట శేఖర్ రెడ్డి మాతృమూర్తి కట్ట జానమ్మ ఈరోజు ఉదయం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు వారి వెంట జిల్లా పరిషత్ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య నల్గొండ మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఎంపీపీ ముఖ్య సలహాదారు శ్రీ విద్యా రాజు తదితరులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్తో ఆటోమొబైల్స్ దగ్ధం

## - అగ్నికి ఆహుతి అయిన సాయి వెంకటేశ్వర ఆటోమొబైల్స్



**కంగ్టి, డిసెంబర్ 24,మన సాక్షి :-**

సంగారెడ్డి జిల్లా తడ్కల్ మండల కేంద్రంలోని స్థానిక పాఠశాల ప్రహరీ గోడకు అనుకొని ఉన్న సాయి వెంకటేశ్వర ఆటోమొబైల్స్ లో ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఒకసారిగా మంటలు చెలరేగడంతో షాపు అగ్నికి ఆహుతి అయ్యింది.పక్కనే ఉన్న తోటి షాప్ యజమానులు వెంటనే స్పందించి దగ్గరలోనే ఉన్న హోటల్ లో నుంచి నీళ్లు పోసి మంటలు చెల్లారపడం జరిగింది. ఈ సందర్భంగా షాప్ ఓనర్ గొల్ల అశోక్,%ఒ% గొల్ల సాయన్న,మాట్లాడుతూ షాపులో ఉన్న ప్యాకింగ్స్, హైడ్రాలిక్ పైప్స్,ఆయిల్ ఫిల్టర్స్,డీజిల్ ఫిల్టర్స్, ఆయిల్ క్యాన్స్,రెండు కౌంటర్లు,మొత్తం అగ్నిలో కాలిపోవడం జరిగిందని అన్నారు. దాదాపు 5 లక్షల రూపాయలు ఆస్తి నష్టం జరిగినట్లు తెలిపారు.ఈ అగ్ని ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అన్నారు.

# త్వరలో దుబ్బాక రింగు రోడ్డు పనులు ప్రారంభం

## - అభివృద్ధికి అందరూ సహకరించాలి



**దుబ్బాక, డిసెంబర్ 24, మనసాక్షి :**

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు దుబ్బాక రింగ్ రోడ్డు ప్లానింగ్ కోసం ప్రతిపాదనలు తయారు చేసేందుకు గాను ఆదివారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చేర్వపూర్, రుషి వనం నుండి ధర్మాజీపేట, లచ్చ పేట, చీకోడ్ రోడ్ లో గల సాయిబాబా టెంపుల్డు నుండి దుబ్బాక సంబంధించిన 99, 1523 సర్వేనెంబర్ ల నుండి మల్లయపల్లి మీదుగా చెల్లాపూర్ దుంపలపల్లి మీదుగా రుషి వనం హబ్సిపూర్ డంబర్ రోడ్ వరకు తిరగడం జరిగిందని జనవరి 15 తేదీలోగా రింగ్ రోడ్డు పనులు ప్రారంభం అవుతాయన్నారు. దుబ్బాక అభివృద్ధికి, రింగు రోడ్డు నిర్మాణానికి పార్టీలకు అతీతంగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో గన్నే భూమి రెడ్డి అస యాదగిరి ఆస స్వామి బట్టు ఎల్లం, ఇల్లందుల శ్రీనివాస్, అధికం బాలకిషన్, దేవుని చంద్రయ్య, ధర్మాజీపేట కనకయ్య, బత్తుల స్వామి, లచ్చపేట శ్రీకాంత్, మరియు మున్సిపల్ ఇన్స్పెక్టర్ దిలీప్, శేఖర్ పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి మహా పడిపూజ అభిషేకాలు

**నల్లగొండ .డిసెంబర్ 24. మన సాక్షి.**

పట్టణంలో ప్రసిద్ధిగాంచిన విజయలక్ష్మి ట్రేడర్స్ వారి ఆ ధ్వర్యంలో మంచుకొండ శ్రీనివాస్ అండ్ బ్రదర్స్ నిర్వహణలో స్థానిక నెహ్రూ గంజిలోని వారి దుకాణ సముదాయం ముందు ఆదివారం హరిహరపుత్ర అయ్యప్ప స్వామి అభిషేకాలు 18 మెట్ల మహా పడిపూజను అత్యంత వైభవంగా ఘనంగా నిర్వహించారు. హరిహరపుత్ర అయ్యప్ప స్వామి మూల విరాట్ కు అష్టాభిషేకాలు, పాలు పెరుగు ,తేనె ,నెయ్యి, పూలు, పండ్లు పంచదార, కొబ్బరినీళ్లు ,అటుకులు, విభూది ,గంధం ,లతో వేద పండితులు గురుస్వాములు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా అభిషేకాలు నిర్వహించారు .స్వామియే శరణమయ్యప్ప అయ్యప్ప స్వామి నామస్మరణంతో భక్తుల భజనలు కీర్తనలతో పరిసరాలు మారుమోగిపోయాయి.

అలాగే 18 మెట్ల మహా పడిపూజను అత్యంత వైభవంగా నిర్వహించారు. 18 మెట్ల ను పూలు పండ్లతో సుందరంగా అలంకరించి దీపారాధన చేసి అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వాములకు అన్నదాన వితరణ చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కంజర శ్రీను భజన బృందం ఆలపించిన భక్తి గీతాలు అయ్యప్ప గీతాలు భక్తులను పరవశింపజేశాయి.

గురు స్వాములు నోముల శ్యామ్ అశోక్ .మేడం విశ్వ



ప్రసాద్. కే వి గుప్తా .ల ఆధ్వర్యంలో పడిపూజ అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు కార్యక్రమంలో విజయలక్ష్మి ట్రేడర్స్ యాజమాన్యులు మంచుకొండ శ్రీనివాస్ మంచుకొండ రమేష్ మంచుకొండ శంకర్ ల తో పాటు కొలనుపాక రవికుమార్ ఉపేందర్ అర్థం శీను. లకుమారపు శీను. పారే పెల్లి శ్రీను. కోటగిరి రామకృష్ణ.అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు అన్నదాన వితరణ చేశారు

# గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగం



**మర్రిగూడ, డిసెంబర్ 24, మన సాక్షి:**

మర్రిగూడ మండలంలోని వెంకేపల్లి గ్రామపంచాయతీలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యాయా? పనులు చేయకుండానే ఏంబిలు చేయించారా? అసలు అక్కడ జరుగుతున్నది ఏంటిది? అధికారులు ఏమైనా దాస్తున్నారా? అక్కడ సర్పంచ్ కొర్ర శీను చేసిన తప్పేంది? సర్పంచ్ కు వార్డ్ నెంబర్లకు గల పంచాయితీ ఏంది? గత నెల రోజుల నుండి వెంకేపల్లి గ్రామపంచాయతీలో చేయను పనులకు ఎంబిలు చేయించుకొని లక్షలకు లక్షలు డబ్బులు కాజేశారని ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్ల ప్రధానమైన ఆరోపణ? వాస్తవానికి అధికారులు ఇన్ని ఆరోపణలు వచ్చినా నిమ్మకు నీరెత్తినట్టు వివరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు, సర్పంచ్ కు అధికారులకు మధ్యన ఏదైనా సయోధ్య తోన ఈ పనులు చేసినారని గ్రామపంచాయతీ వార్డ్ మెంబర్లు ఆరోపిస్తున్నారు, ఈ మధ్యకాలంలోనే గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు, వాస్తవానికి ఈ గ్రామం శివన్నగూడెం రిజర్వాయర్లు పోతుందన్న అధికారులు ఈ గ్రామాన్ని పట్టించుకోలేదని వారు చెప్తున్నారు, సర్పంచ్ మాత్రం వార్డ్ మెంబర్లు రెవిన్యూ సిబ్బంది మరి కొందరు వ్యక్తులు కలిసి రైతులకు తెలియకుండానే రైతుల వచ్చేనష్టపరియారాన్ని లక్షల్లో కాజేశారని సర్పంచ్ ఆరోపణ ఈ విషయాన్ని రైతులకు తెలియజేస్తాననే భయంతోనే నాపై ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ చెబుతున్నారు, ఏది నిజమో? ఏది అబద్ధమో? వాస్తవ పరిస్థితులను?సర్పంచ్ ఎంత మేరకు అవినీతి చేశారు? అధికారులు ఎవరెవరు సహకరించారు? మన సాక్షి ఇన్వెస్టిగేషన్ చేసి సంపూర్ణ సమాచారంతో మీ ముందుకు వస్తాం

# వైసీపీ యువజన విభాగం అధ్యక్షుల నియామకం

**మెలియాపుట్టి. డిసెంబర్ 24. మన సాక్షి:**



శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాలకువైసీపీ యువజన విభాగం అధ్యక్షులు నియామకం ప్రక్రియ పూర్తయినట్లు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి క్యాంపు కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. పాతపట్నం మండలానికి గోకవలస రాము, మెలియాపుట్టి మండలానికి బొడ్డు ప్రకాష్, ఎల్.ఎన్.పేటకు బి భాస్కరరావు, కొత్తూరుకు కర్నేన రమణ, హిరమండలం మండలానికి చక్క బాలకృష్ణ, లను వైయస్సార్ సీపీ అధ్యక్షులుగా నియమించారు.

# రెండు లక్షల ఎల్ ఓ సి అందజేత



**మర్రిగూడ, డిసెంబర్ 24, మన సాక్షి:**

రెండు లక్షల ఎల్ఓసి అందజేత, మర్రిగూడ మండలంలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన పాక సంతోష అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరడం జరిగింది, నిరుపేద కుటుంబం కావడంతో చికిత్స చేయడానికి డబ్బులు లేక బాధపడుతున్న విషయం లెంకలపల్లి సర్పంచ్ పాక నగేష్ ద్వారా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయాన్ని తెలుసుకొని వెంటనే రెండు లక్షల ఎల్ ఓసిని మంజూరు చేయించి, భర్త పాక సత్తయ్య కు మునుగోడు క్యాంపు కార్యాలయంలో అందజేయడం జరిగింది, ఈ సందర్భంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వాన్ని నిరుపేదలను కడుపులో పెట్టుకొని చూసుకుంటామని, ఏ ఆపద వచ్చిన ఎవరి సహకారం లేకుండా నేరుగా తన దగ్గరికి రావాలని మునుగోడు నియోజకవర్గ ప్రజలు ఆయన కోరారు, ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మేతరి యాదయ్య, రాందాస్ శీను, మేతరి శంకర్,పాక పరమేష్ తదితరులు పాల్గొన్నారు,

# సివిల్ వివాదంలో పోలీసుల జోక్యం..?

## 70 ఏళ్ల వృద్ధి అతని కుమారుని స్టేషన్లో కూర్చోబెట్టిన పోలీసులు తనని కలవలేదని అక్కసే కారణం...?

**చివ్వెంల, డిసెంబర్ 24, మన సాక్షి**

భూ వివాదంలో ఓ వృద్ధుడిని, అతని కుమారుడిని పోలీస్ స్టేషన్ కి పిలిపించిన స్టేషన్లను ఉంచిన సంఘటన శనివారం సూర్యాపేట జిల్లా చివ్వెంల పోలీస్ స్టేషన్ లో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం చివ్వెంల మండలం ఖాసింపేటకు చెందిన లింగయ్య, లింగారెడ్డిల మధ్య భూ వివాదం కొనసాగుతుంది. దీంతో లింగారెడ్డి ఇటీవల స్థానిక పోలీస్ స్టేషన్ లో లింగయ్య పై ఫిర్యాదు చేయగా పోలీసులు లింగయ్యని స్టేషన్ పిలిపించారు. తిరిగి వెళ్లే క్రమంలో లింగయ్య ఎవరిని కలవకుండా వెళ్లడంతో తిరిగి శనివారం పోలీస్ స్టేషన్ కు పిలిపించారు. షుగరు బిపి తో ఉన్న లింగయ్యను సైదులు అనే పోలీసు ఉదయాన ఏడు గంటలకు స్టేషన్ కు తీసుకువెళ్లి సాయంత్రం వరకు అక్కడే కూర్చోబెట్టినట్లు సమాచారం. దీంతో అతని మనవడికి రక్తంలో ఇన్ఫెక్షన్ రావడంతో ఖమ్మం ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు లింగయ్య కుమారుడు తండ్రిని విడిపించుకునేందుకు వెళ్లగా అతనిని కూడా స్టేషన్లోనే కూర్చోబెట్టినట్లు సమాచారం. అసలు సివిల్ వివాదంలో పోలీస్ స్టేషన్ తీసుకువెళ్లడం ఒక కారణమైతే 70 ఏళ్ల వృద్ధుడిని పైగా షుగర్, బీపీతో బాధపడుతున్న వ్యక్తిని, రోజంతా ఉంచి కనీసం మనవన్ని ఇవ్వడానికి కూడా పంపించకపోవడం మరొక విశేషం.

# ఆర్థిక సహాయం అందజేత



**వలిగొండ: డిసెంబర్ 24 ,మన సాక్షి**

వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామంలో షేక్ మదర్ కూతురు షేక్ మౌలాభి వయసు రెండు సంవత్సరాలు, అనారోగ్యంతో మరణించింది విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# దావ శైలజ శ్రీనివాస్ కు ఘన సన్మానం

**చింతపల్లి. డిసెంబర్ 24 మనసాక్షి.**



చింతపల్లి మండల పరిధిలోని కురంపల్లి గ్రామానికి చెందిన బిజెపి నాయకురాలు మాజీ సర్పంచ్ దావ శైలజ శ్రీనివాస్ కు సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలుగా భారతీయ జనతా పార్టీ వారిని నియమించడం హర్షించదగ్గ విషయమని దేవరకొండ నియోజకవర్గం ఇంచార్జ్ బిజెపి గిరిజన ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు కేతావత్ లాలు నాయక్ అన్నారు. ఈ సందర్భంగా వారు హైదరాబాదులో వారిని కలుసుకొని ఘనంగా సన్మానించారు. పార్టీ సిద్ధాంతాన్ని నమ్ముకుని గత 20 సంవత్సరాలుగా దావ శైలజ శ్రీనివాస్ పార్టీ అభివృద్ధికి తోడ్పాటున అందిస్తూ ముందుకు వెళ్లడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో కూడా పాల్గొంటున్నారు అన్నారు. ప్రజల మధ్యలో ఉండి ప్రజా సమస్యల కోసం పనిచేసే వ్యక్తులను పార్టీ వారికి తగిన ప్రాధాన్యత కల్పిస్తుందని వారి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలుగా నియమించడం పట్ల భారతీయ జనతా పార్టీ అధిష్టానానికి రాష్ట్ర ముఖ్య నాయకులు జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముడిగా వెంకటయ్య యాదవ్,మల్లేష్,శేషు,మహేందర్,శ్రీను,పరమేష్ బాల జంగయ్య గౌడ్, శేఖర్, కుక్కడ రామకృష్ణ, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పార్టీ ఆదేశిస్తే ఎంపీ గా తన కుమారుడు పోటీకి సిద్ధం.

**నల్లగొండ ,డిసెంబర్ 24 , మన సాక్షి,**



నల్లగొండలోని తన నివాసంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ" పార్టీ అదేశిస్తే నల్లగొండ పార్లమెంట్ లేదా భువనగిరి పార్లమెంట్ నుండి నా కుమారుడు గుత్తా అమిత్ రెడ్డి పోటీ చేస్తారు అని తెలిపారు తెలంగాణలో 4 జిల్లాలో మాత్రమే కాంగ్రెస్ కు అనుకూలంగా ఉంది. మిగతా జిల్లాలలో మిక్సుడ్ ఫలితాలు వచ్చాయి అన్నారు హైదరాబాద్, మెదక్ జిల్లాలో బి ఆర్ ఎస్ పార్టీ ఆధిపత్యం కనిపించింది అన్నారు. ఎమ్మెల్యేల మీద వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది, బీఆర్ఎస్ ప్రభుత్వం పోతుందని కలలో కూడా అనుకోలేదు అని తెలిపారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ గారే ఉండాలని ప్రజలంతా అనుకున్నారు. కానీ ఎమ్మెల్యేలు ఓడిపోవడం వల్ల ఫలితం తారుమారైంది అన్నారు నల్గొండ జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై కొత్తగా వచ్చిన ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలి. నా వంతుగా ప్రాజెక్టులపై సూచనలు, సలహాలు అందించాను.కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ప్రోటోకాల్ ను పకడ్బందీగా అమలు చేయాలి అని కోరారు. కాంగ్రెస్ 6గ్యారంటీ లు ఇప్పట్లో అమలు సాధ్యం కాదు. బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో సృష్టించిన ఆస్తుల మీద స్వేదపత్రం విడుదల చేస్తుంది. పార్లమెంటు పై పొగ బాంబ్ దాడి భద్రత లోపాలలను స్పష్టంగా చూపిస్తుంది . ప్రభుత్వాలు రాష్ట్ర భవిషత్తు గురించి, అభివృద్ధి కోసం పని చేయాలి .అంతేకాని పట్టుదలకు పోయి చతికలపడొద్దు. ఆరోపణలు లేని ప్రభుత్వాలు దేశంలో లేవు. అలాగే బి ఆర్ ఎస్ ప్రభుత్వం పై కూడా ఆరోపణలు చేస్తున్నారు . ఏ ప్రభుత్వం అయిన హుందాతనంగా వ్యవహరించాలి అని కోరారు

# గిరిజనులకు దుప్పట్లు పంపిణీ



**మెలియాపుట్టి. డిసెంబర్ 24. మన సాక్షి:**

శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం మెలియాపుట్టి మండలం భరణికోట గ్రామపంచాయతీ పరిధిలో గల కాటమ వీధి గ్రామములో శ్రీ కాటమ కోటి లింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో విజయనగరం జిల్లా పొనుగుటవలస గ్రామానికి చెందిన శాసకు వెంకటరమణ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గిరిజనులకు దుప్పట్లను ఆదివారం పంపిణీ చేశారు. గిరిజన గ్రామాలైన జన్ని వీధి, జక్కర వీధి, భరణికోట కాలనీ ,బాలేరు ,మర తదితర గిరిజన గ్రామాల వృద్ధులకు, మహిళాలకు, నూతన వస్త్రాలు, దుప్పట్లను పంపిణీ చేశారు. కరజాడ గ్రామానికి చెందిన బమ్మిడి చక్రపాణి గిరిజనులకు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారు కృష్ణారావు, సవర అప్పారావు, సవర గోపాల్ , సవర కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# పాపులను రక్షించేందుకు క్రీస్తు జననం

**మెలియాపుట్టి. డిసెంబర్ 24. మన సాక్షి:**



పాపులను రక్షించేందుకు యేసుక్రీస్తు జన్మించారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నియోజకవర్గం మెలియాపుట్టి మండలం నందవ గ్రామంలో వర్డ్ ఆఫ్ గ్రేస్ ఫెలోషిప్ చర్చిలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ ను ఉద్దేశించి ప్రసంగించారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు..అనంతరం గిరిజన వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ కాపరి పాస్టర్ ఎస్ అన్నయ్య, వైస్ ఎంపీపీ సవర ఆది నాయుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖరరెడ్డి, వైసీపీ నాయకుడు కన్నబాబు, గ్రామ సర్పంచులు సిద్దిపాలెం గౌరేష్, గణేష్ ప్రధాన్, వైస్ ఎంపీపీ ప్రతినిధి పాడి అప్పారావు, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు చాపర సోమేశ్వరరావు, చాపర నారాయణరావు, వార్డు మెంబర్లు ఆదినారాయణ, మాజీ సర్పంచ్ దీనబంధు,విశాఖ,కృష్ణ, మోహన్, మరియు క్రైస్తవ ప్రజలు ఉన్నారు.

# కూచిపూడి లెస్సన్‌కు గిన్నిస్ రికార్డ్

**శేరిలింగంపల్లి:** భారతీయ సంప్రదాయ ప్రాచీన నృత్యం కూచిపూడి డ్యాన్స్ లెస్సన్ గిన్నిస్ వరల్డ్ రికార్డులోకి ఎక్కింది. ఏకకాలంలో 3,883 మంది నృత్య కళాకారులు ఆదివారం రాత్రి కూచిపూడి కళావైభవాన్ని ప్రదర్శించారు. దీనికి గచ్చిబౌలిలోని బాలయోగి అథ్లెటిక్ క్రీడాస్టేడియం వేదికైంది. భారత్ ఆర్ట్ అకాడమీ అధ్వర్యంలో కూచిపూడి కళావైభవం పేరిట అతిపెద్ద కూచిపూడి లెస్సన్ ప్రదర్శించారు. స్టేడియంలో పలువైపులా ఏడు నిమిషాలపాటు కళాకారులు సంప్రదాయ దుస్తుల్లో ఏకకాలంలో కూచిపూడి నృత్య సాధన చేసి గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ఎక్కారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు సంస్థ ప్రతినిధి రిషినాథ్ సర్టిఫికెట్‌ను అందజేశారు.

# తెల్లకార్డు ఉంటేనే ఆరు గ్యారెంటీలు

**హైదరాబాద్:** రాష్ట్రప్రభుత్వం అమలుచేయబోతున్న ఆరు గ్యారెంటీలకు రేషన్ కార్డునే ప్రామాణికంగా తీసుకొంటామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 28 నుంచి జనవరి 6వ వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన' కార్యక్రమాన్ని నిర్వహించి, ఆరు గ్యారెంటీల అమలుకు సంబంధించి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తామని చెప్పారు.

ఈ పథకాలకు విధి విధానాలను త్వరలోనే వెల్లడిస్తామని, ప్రస్తుతానికి తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నట్టు వెల్లడించారు. రేషన్‌కార్డు ఉన్నవారి అర్హతల ఆధారంగా దరఖాస్తు తీసుకుంటామని చెప్పారు. కొత్త రేషన్ కార్డులకు, రైతుబంధుకు కూడా ఇక్కడే దరఖాస్తులు తీసుకోబోతున్నట్టు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంపై సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి పొంగులేటి మీడియాకు వివరించారు.

గ్రామాలకే అధికారుల బృందం

ప్రజా పాలనలో భాగంగా ప్రతి గ్రామం, వార్డు, డివిజన్, పట్టణాల్లో అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నట్టు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇందుకోసం కొంతమంది అధికారులతో కలిపి బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. 'అధికారుల బృందం ప్రతిరోజు రెండు గ్రామాలను సందర్శిస్తుంది. గ్రామాలు, తండాలు, అనుబంధ గ్రామాల్లోకి కూడా వెళ్లి దరఖాస్తులు తీసుకుంటారు. ఉద యం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఒక గ్రామం లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 వరకు మరో గ్రామంలో సమావేశాలు నిర్వహించి దరఖాస్తులు తీసుకుంటారు. దరఖాస్తులను రెండు రోజుల ముందే కలెక్టర్ల ద్వారా ఆయా గ్రామాలకు అందజేస్తారు. గ్రామాల్లో అర్హతను బట్టి ప్రజలకు దరఖాస్తు ఫారాలు అందజేస్తారు. 28వ తేదీ నుంచి వారి అర్హతకు అనుగుణంగా దరఖాస్తు స్వీకరించి రిసిప్ట్ కూడా అందజేస్తారు' అని వివరించారు.